


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :127 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శనివారం 11 జనవరి 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 127 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SAT 11 JANUARY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## నేనే క్షమాపణ చెప్పాను.. మీకు చెప్పడానికి ఏంటి నామోషీ?



- టీటీడీ చైర్మన్, సభ్యులు ప్రెస్ మీట్ పెట్టి క్షమాపణ చెప్పాలన్న పవన్
- కొందరు అధికారులు పని చేయడం మానేశారని మండిపాటు
- కూటమి ప్రభుత్వం 15 ఏళ్లకు తక్కువ కాకుండా ఉండాలని ఆకాంక్ష

పెన్ పవర్ డెస్క్: తిరుమల తొక్కిసలాట ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ విషాద ఘటనపై టీటీడీ ఛైర్మన్, సభ్యులు ప్రెస్ మీట్ పెట్టి క్షమాపణ చెప్పాలని సూచించారు. తానే క్షమాపణ చెప్పినప్పుడు... మీకు చెప్పడానికి నామోషీ ఏమిటని ప్రశ్నించారు. తాను మాత్రమే దోషిగా నిలబడాలా? అని ప్రశ్నించారు. వీఐపీ ట్రీట్మెంట్ తగ్గించాలని... కామన్ మేన్ ట్రీట్మెంట్ పెంచాలని చెప్పారు.

వివరాలు 2లో..



## రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశాం

- రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రారంభించామన్న చంద్రబాబు
- నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని వ్యాఖ్య
- రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశామన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:కొత్త ఏడాదిలో రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగం అధ్వానంగా మారిందని అన్నారు. తమను నమ్మిన ప్రజలు 93 శాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందించారని... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రారంభించామని చెప్పారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో నిర్వహిస్తున్న నరెడ్కో ప్రాపర్టీ షోను చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ విశాఖకు వచ్చి రూ. 2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారని చంద్రబాబు తెలిపారు. నిర్మాణ రంగంపై 34 లక్షల మంది ఆధారపడి ఉన్నారని చెప్పారు. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చి నిర్మాణ రంగానికి ఊతమిచ్చామని అన్నారు. భూ సమస్యలకు సంబంధించి గతంలో ఎన్నడూ చూడని విధంగా దరఖాస్తులు వస్తున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు.

వివరాలు 2లో..

## రోజా కూడా తిరుమల పవిత్రత గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది

- తిరుమల ఘటన నేపథ్యంలో వైసీపీ నేత రోజాపై పంచుమర్తి అనురాధ మండిపాటు
- ఈ ఘటనను అడ్డుపెట్టుకుని రోజా డ్రామాలు ఆడేందుకు పరామర్శ నెపంతో అక్కడికి వెళ్లారని విమర్శ
- టీటీడీని వైసీపీ నేతలు ఏటీఎం మిషన్‌గా మార్చేశారన్న అనురాధ



పెన్ పవర్ డెస్క్:తిరుమలను ఆదాయ వనరుగా మార్చుకుని, కలి యుగ దైవాన్ని కూడా దోచేసిన వైసీపీ నేత, అవినీ తి అనకొండ రోజా రెడ్డి

వివరాలు 2లో..

## ఢిల్లీలో పాతికేళ్లుగా బీజేపీకి అధికారం దక్కలేదు... అందుకే ద్వేషం పెంచుకుంది



- ఢిల్లీని బీజేపీ నేర రాజధానిగా మారుస్తోందని ఆగ్రహం
- దొంగతనాలు, చైన్ స్నాచింగ్, గ్యాంగ్ వార్‌లు నిత్యకృత్యమయ్యాయని ఆగ్రహం
- మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారన్న కేజ్రీవాల్

పెన్ పవర్ డెస్క్:పాతికేళ్లుగా బీజేపీకి ఢిల్లీలో అధికారం దక్కలేదని, దీంతో ఇక్కడి ప్రజలపై ఆ పార్టీ ద్వేషం పెంచు కుందని ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్

వివరాలు 2లో..

## వైఎస్ అభిషేక్ రెడ్డి కన్నుమూత



- అనారోగ్యంతో మృతి చెందిన అభిషేక్ రెడ్డి
- భౌతికకాయాన్ని పులివెందులకు తరలిస్తున్న కుటుంబ సభ్యులు
- ఉదయం పులివెందులలో అంత్యక్రియలు

వివరాలు 2లో..

## ప్రాణాలు తీసిన వారిని ఎందుకు కాపాడుతున్నారు?




- తిరుపతి తొక్కిసలాటకు టీటీడీ ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో, ఎస్పీ కారణమన్న రోజా
- సమాజ మెప్పు కోసం ఈ విషయాన్ని పవన్ అంగీకరించారని వ్యాఖ్య
- బాధ్యులపై చర్యలను ఎందుకు కోరడం లేదని ప్రశ్న

వివరాలు 2లో..

## చెవిరెడ్డికి హైకోర్టులో షాక్.. క్వాష్ పిటిషన్ కొట్టివేత

- చెవిరెడ్డి పిటిషన్ ను తోసిపుచ్చిన ఏపీ హైకోర్టు
- బాలికపై అత్యాచారం జరిగిందంటూ చెవిరెడ్డి వ్యాఖ్యలు
- చెవిరెడ్డిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు



పెన్ పవర్ డెస్క్: వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాకిచ్చిం ది. ఆయనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేసేందుకు నిరాకరిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. చెవిరెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను తోసిపుచ్చింది. గతంలో పద్నాలుగేళ్ల బాలికపై

వివరాలు 2లో..

## క్షమాపణలు చెప్పడంలో తప్పులేదు!

### తొక్కిసలాట ఘటనపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

- క్షమాపణలు చెప్పినంత మాత్రాన చనిపోయిన వారు తిరిగి రారని వ్యాఖ్య
- ఎవరో ఏదో మాట్లాడారని స్పందించాల్సిన అవసరం లేదన్న బీఆర్ నాయుడు
- విచారణను త్వరగా పూర్తి చేయాలని సీఎంను కోరుతామన్న టీటీడీ ఛైర్మన్



పెన్ పవర్ డెస్క్: వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం టోకెన్ల జారీ వేళ జరిగిన తొక్కిసలాట ఘటనపై టీటీడీ ఛైర్మ న్ బీఆర్ నాయుడు మరోసారి స్పందించారు. తొక్కిసలాట ఘటనకు బాధ్యులైన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఈ ప్రమాదంపై క్షమాపణలు

వివరాలు 2లో..

## ఏపీ ప్రజలకు ప్రధాని మోదీ వెన్నుపోటు



- రాష్ట్ర ప్రజలను మోదీ దారుణంగా మోసం చేశారన్న షర్మిల
- విశాఖ పర్యటనలో విభజన హామీలపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శ
- మోదీతో సీఎం చంద్రబాబుది సక్రమ సంబంధమైతే జగన్‌ది అక్రమ సంబంధమని వ్యాఖ్య
- మన దేశాన్ని రక్షించుకోవాలి అంటే కాంగ్రెస్ పార్టీ అవసరమన్న షర్మిల

పెన్ పవర్ డెస్క్:ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. హోదా ఇస్తామని మో సం చేశారని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసిన మోదీతో సీఎం చంద్రబాబుది సక్రమ సంబంధమైతే జగన్‌ది అక్రమ సంబంధమని షర్మిల విమర్శించారు. ఈ మేరకు ఏపీసీసీ చీఫ్ ట్వీట్ చేశారు. "ఏపీ ప్రజలను ప్రధాని మోదీ దారుణంగా వెన్నుపోటు పొడిచారు.

వివరాలు 2లో..

## మిల్క్ షేక్ తయారుచేసిన రాహుల్ గాంధీ..



పెన్ పవర్ డెస్క్:లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓ రెస్టారెంట్ లో స్వయంగా మిల్క్ షేక్ తయారుచేసి కస్టమర్ కు అందించారు.

వివరాలు 2లో..

## హరీశ్ రావును 28వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దు

### పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

- హరీశ్ రావుపై పంజాగుట్ట పీఎస్‌లో చక్రధర్ గౌడ్ ఫిర్యాదు
- కేసు నమోదు కావడంతో హైకోర్టులో హరీశ్ రావు క్వాష్ పిటిషన్
- హరీశ్ రావును 28వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దని మధ్యంతర ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు తాత్కాలిక ఊరట లభించింది. పంజాగుట్ట పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని, అరెస్ట్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో హరీశ్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గతంలో విచారించిన న్యాయస్థానం... హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది. ఈరోజు నేడు మరోసారి ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది.కౌంటర్ దాఖలు చేయాలని ఫిర్యాదుదారు చక్రధర్ గౌడ్‌కు ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# మళ్లీ వచ్చిపడుతున్న మాయదారి వైరస్ లు

అదిగో పులి అంటే ఇదిగో తోక అనే ప్రపంచం. అందుకే ఇప్పుడు తుమ్మినా దగ్గినా భయం. రోగనిరోధక శక్తి తక్కువుంటేనో, సీజన్ మారితేనో.. చిన్నాచితకా అనారోగ్య సమస్యలు కామన్. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నాలుగురోజుల్లో అంతా నార్మల్. కానీ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన తర్వాత ఇప్పుడు కాస్త పడిశం పట్టినా, గొంతు గరగరమన్నా గుండెల్లో దడే. కడుపులో కాస్త మందంగా అనిపిస్తే ఒకప్పుడు ఓ పూట పత్యంచేస్తే సెట్టయ్యేది. కానీ ఇప్పుడు ఏ దిక్కుమాలిన వైరస్ శరీరంలోకి ప్రవేశించిందోనని అనుమానం హార్ట్‌బీట్ పెంచేస్తోంది. ఏం చేస్తాం మరి.. మళ్లీ వచ్చిపడుతున్నాయ్ మాయరోగాలు. చైనాకు రోగమొచ్చింది. ప్రపంచమంతా వణికిపోతోంది. కేసుల ఊసులేదు. ఊహాజనిత ప్రచారాలే తప్ప అధికారికంగా మరణాల సంఖ్య కూడా తెలీదు. చైనాలో మెడికల్ ఎమర్జెన్సీ డిక్లేర్ చేశారంటూ అనధికార వార్తలు. హెచ్ఎంపీ వైరస్ ..హ్యూమన్ మెటా న్యూమో వైరస్. కరోనాకి కజిన్‌లాంటిదే ఈ వైరస్ కూడా. కరోనా ప్రపంచాన్ని కుదిపేసింది. లక్షల ప్రాణాలను గాల్లో కలిపేసింది. మరి హెచ్ఎంపీవీ కూడా అంతే ప్రమాదమా అంటే అవునని చెప్పలేం. ప్రాణాంతకం కాదని కొట్టిపారేయలేం. ఎందుకంటే కరోనా సీజన్‌లో భయమే మనిషిని చంపేసింది. కరోనా వేరియంట్లలాగే హెచ్ఎంపీ వైరస్ టార్గెట్.. మన శరీరంలోని ఊపరితిత్తులే. అసలే కరోనా ప్రభావంతో లంగ్స్ వీకైపోయాయి. ఈ టైంలో కొత్త వైరస్ ఎఫెక్ట్‌పడితే ఏం జరుగుతోందనని భయం. ఓపక్క వైరస్‌ల పుట్టినింట్లో హెచ్ఎంపీ వైరస్ కల్లోలం సృష్టిస్తోందన్న ప్రచారం జరుగుతున్న సమయంలోనే.. అగ్రరాజ్యంలో నోరో వైరస్ వణికిస్తోంది. మరోవైపు పక్షులు, పశువులకే పరిమితమనుకునే బర్డ్‌ఫ్లూతో అమెరికాలో తొలిసారి ఒకరు మృత్యువాత పడ్డారు. అడవి పక్షులకు దగ్గరగా వెళ్లడంతో హెచ్5ఎన్1 సోకి ప్రాణాలు కోల్పోయాడు 65ఏళ్ల వ్యక్తి. వాస్తవానికి కరోనా తర్వాత ప్రపంచమంతా అంతగా చర్చ జరుగుతోంది హెచ్ఎంపీ వైరస్ గురించే. ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారినపడుతున్నట్లు కథనాలొస్తున్నాయి. శీతాకాలం అంటువ్యాధులు త్వరగా ప్రబలుతుంటాయి. జలుబు, జ్వరం, దగ్గు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఈ సీజన్‌లో సర్వసాధారణం. చాలామంది వీటికి ఏ టాబ్లెట్టో వేసుకుని ఉపశమనం పొందుతుంటారు. కానీ ఇప్పుడు కొంపదీసి కొత్త వైరస్సేమో అనే భయంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇమ్యూనిటీ సిస్టమ్ తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధులపై హెచ్ఎంపీ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పెద్దగా భయపడాల్సిన పన్లేదన్న మాట బలంగా వినిపిస్తున్నా.. కోవిడ్ 19కంటే తక్కువ ప్రమాదమేం కాదన్న వాదనకూడా వినిపిస్తోంది. ప్రస్తుతానికైనా ఈ వైరస్‌కి వ్యాక్సిన్ లేదు. అలాగని ఇదేం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన వైరస్ కాదు. హెచ్ఎంపీ వైరస్ ప్రచారంతోనే జనం ఉక్కిరిబిక్కిరవుతుంటే.. మరోవైపు నోరో వైరస్ విజృంభిస్తోందన్న వార్తలు మరింత భయపెడుతున్నాయి. అమెరికాలో నోరో వైరస్ రోజురోజుకీ తీవ్రమవుతోంది. యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ డేటా ప్రకారం ఆ దేశంలో నోరో వైరస్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. నవంబరు నుంచీ అగ్రరాజ్యంలో ఆ వైరస్ బాధితులు పెరుగుతున్నారు. నోరో వైరస్ జీర్ణకోశానికి సోకే వ్యాధి. బాధితులనుంచి నోరో వైరస్ ఇతరులకు వేగంగా సోకే అవకాశముంది. 12నుంచి 48 గంటల తర్వాత లక్షణాలు కనిపిస్తాయి. అతిసారం, వాంతులు, వికారం, కడుపు నొప్పి, జ్వరం, తలనొప్పి, బాడీ పెయిన్స్ ఉంటాయి. వైరస్ సోకిన రెండు రోజులపాటు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుముఖం పడుతుంది. నోరో వైరస్ కూడా కొత్తదేం కాదు. అమెరికాకి ఇప్పుడు సోకింది కాబట్టే ప్రపంచం ఉలిక్కిపడుతోందంతే. గతంలోనే తెలుగురాష్ట్రాల్లో ఈ వైరస్ లక్షణాలపై ప్రజలను ప్రభుత్వాలు అప్రమత్తం చేశాయి. ఆరునెలల క్రితమే హైదరాబాద్‌లో 100కు పైగా కేసులు నమోదయ్యాయి. పాతబస్తీలో తొందరగా వ్యాప్తిచెందిన నోరో వైరస్‌పై అప్పట్లో జీహెచ్ఎంసీ ప్రజలను అప్రమత్తంచేసింది. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల జాబితాలోనే నోరో వైరస్ కూడా ఉంది. పారిశుద్ధ్యం, కలుషిత ఆహారంతోనే ఈ వైరస్ వ్యాప్తిచెందుతుందని గుర్తించారు. ముఖ్యంగా ఈ వైరస్ మధ్య వయస్కులు, వృద్ధులు, గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికల్లో కిడ్నీ ఇన్ఫెక్షన్స్ కలిగిస్తుందని వైద్యులు చెబుతున్నారు. నోరో వైరస్ కంటే బర్డ్‌ఫ్లూనే ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ఓ పక్క ఈ మాయదారి రోగాలేంటని ప్రజలు తలపట్టుకుంటుంటే.. అటు మార్కెట్లు కూడా షేకవుతున్నాయి. చైనా తర్వాత భారత్‌ను తాకిన హెచ్ఎంపీవీపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలి సారిగా స్పందించింది. ఈ వైరస్ ను సాధారణ వైరస్‌గా చిఊూ అభివర్ణించింది. హెచ్ఎంపీ వైరస్ అంటే హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కొత్తది కాదని..దీనిని 2001లోనే గుర్తించామని సంస్థ తెలిపింది. ఇది చాలా కాలంగా ప్రజలలో ఉంది.. ఈ వైరస్ ప్రభావం శీతాకాలంలో పెరుగుతుందని పేర్కొంది.

చైనాలో అనేక హెచ్ఎంపీ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఈ వైరస్ కేసులు భారతదేశంలో కూడా వెలుగులోకి రావడం మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆందోళన మరింత పెరిగింది. ఈ వైరస్ కూడా కరోనా లాంటి వినాశనానికి కారణమవుతుందా అంటూ రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ప్రజలు భయాందోళన చెందవద్దని ఇటీవల ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు చిఊూ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ప్రపంచంలో ఎక్కడ యుద్ధమేఘాలు కమ్ముకున్నా, ఎక్కడ ఏ వైరస్ వ్యాపించినా ముందు కుప్పకూలేది స్టాక్‌మార్కెట్లే. హెచ్ఎంపీ వైరస్ ప్రభావం ప్రజలపైనే కాదు.. ఇటు స్టాక్‌మార్కెట్లపైనా పడింది. దేశంలో కొత్త వైరస్ కేసులు వెలుగుచూడగానే భల్లూకపు కౌగిట్లో చిక్కుకుంది మన స్టాక్‌మార్కెట్. ఈ వారం రోజుల్లోనే దాదాపు 15లక్షలకోట్ల మేర మదుపరుల సంపద ఆవిరైంది.

# రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశాం

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలే దీనికి కారణమని మండిపడ్డారు. భూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశామని చెప్పారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేదే తమ లక్ష్యమని అన్నారు. టీడీఆర్ బాండ్లలో డబ్బులు తీసుకుంది ఒకరు... నష్టపోయింది ఇంకొకరని చంద్రబాబు చెప్పారు. దీన్ని కూడా గత పాలకులు అక్రమాలకు వాడుకున్నారని... అవినీతికి పాల్పడ్డవారిని వదలిపెట్టబోమని... అమాయకుల్ని కాపాడతామని తెలిపారు. అమరావతి పనులను రూ.50 వేల కోట్లతో ప్రారంభిస్తామని చెప్పారు. రియల్ ఎస్టేట్ ఎక్కడ బాగుంటుందో అక్కడ సంపద సృష్టి జరుగుతుంది అన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కన్నా పెద్దగా అమరావతి చుట్టూ 183 కి.మీ మేర రింగ్ రోడ్డుకు ప్లాన్ సిద్ధం చేశామని... అది పూర్తయితే గుంటూరు-అమరావతి పట్టణాలు కలిసిపోతాయని తెలిపారు. దేశంలో అమరావతి లాంటి నగరం మరొకటి రాదని... కొత్త నగరాన్ని బెస్ట్ మోడల్ సిటీగా నిర్మిస్తామని చెప్పారు. ఒక్క అమరావతినే కాదు విశాఖ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి లాంటి పట్టణాలను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

## నేనే క్షమాపణ చెప్పాను.. మీకు చెప్పడానికి ఏంటి నామోషీ?

- మొదటి పేజీ తరువాయి

పిఠాపురం నియోజకవర్గం కుమారపురంలో గోకులం షెడ్లను పవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే, చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మి మీరంతా ఓట్లు వేశారని... ఎక్కడ తప్పు జరిగినా స్పందించే గుణం ఉండాలని... అందుకే తిరుపతి తొక్కిసలాట ఘటనపై మనస్ఫూర్తిగా క్షమాపణ కోరానని పవన్ అన్నారు. గోకులాల ద్వారా చిన్న, కౌలు రైతులు బాగుపడతారని పవన్ చెప్పారు. వైసీపీ పాలనలో 268 గోకులం షెడ్లను నిర్మిస్తే... ఈ ఆరు నెలల్లో తమ ప్రభుత్వంలో 12,500 షెడ్లను నిర్మించామని తెలిపారు. భవిష్యత్తులో 20 వేల గోకులాలను నిర్మిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో అలవాటు పడిన కొందరు అధికారులు పని చేయడం మానేశారని పవన్ మండిపడ్డారు. తనకు అధికారం అంటే అలంకారం కాదని చెప్పారు. ఎవరైనా ఇష్టానుసారం వ్యవహరిస్తే తొక్కి నార తీస్తానని హెచ్చరించారు. 15 ఏళ్లకు తక్కువ కాకుండా కూటమి ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. తనకు డబ్బు, పేరు మీద ఇష్టం లేదని... తనకు బాధ్యత మాత్రమే ఉందని అన్నారు. పిఠాపురం నుంచి జిల్లాల పర్యటనను మొదలు పెడతానని చెప్పారు.

## వైఎస్ అభిషేక్ రెడ్డి కన్నుమూత

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ నేత, వైఎస్ అభిషేక్ రెడ్డి కన్నుమూశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వైసీపీ అధినేత జగన్ కు అభిషేక్ రెడ్డి బంధువు అవుతారు. అభిషేక్ రెడ్డి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు పులివెందులకు తరలిస్తున్నారు. పులివెందులలో రేపు ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అంత్యక్రియల్లో జగన్, ఆయన భార్య భారతి పాల్గొననున్నారు.

## హరీశ్ రావును 28వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దు

- మొదటి పేజీ తరువాయి

తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో హరీశ్ రావుపై చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. అయితే హరీశ్ రావు కక్షకట్టి తనను క్రిమినల్ కేసుల్లో ఇరికించారని, తన ఫోన్‌ను ట్యాప్ చేయించారని ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో హరీశ్ రావు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

## ప్రాణాలు తీసిన వారిని ఎందుకు కాపాడుతున్నారు?

**పెన్ పవర్ డెస్క్:** కూటమి ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్యం కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా ఆవేదనవ వ్యక్తం చేశారు. ఈ ఘటనకు టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈఓ, జిల్లా ఎస్పీ ప్రధాన కారణమని అన్నారు. ప్రజల్లో అగ్రహం రావడంతో... సమాజ మెప్పు కోసం ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా అంగీక రించారని చెప్పారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరా వు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి పూర్తిగా విఫలమయ్యారనే విషయం పవన్ మాటలతో స్పష్టమయిందని రోజా అన్నారు. కీలక స్థానంలో ఉన్న ప్రధాన అధికారులు, పాలకమండలి వైఫల్యం కారణంగా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అందుకు కారణమైన టీటీడీ ఛైర్మన్, ఈఓ, అదనపు ఈఓలపై చర్యలు తీసుకోవాలని పవన్ ఎందుకు అడగరు? అని ప్రశ్నించారు. సమాజంలో ఉన్న అభిప్రాయాన్ని తాను చెప్పడం ద్వారా

ప్రజలు మెప్పు పొందటం, చంద్రబాబుకు ఇష్టమైన అధికారులపై చర్యలు కోరకుండా తన రాజకీయ ప్రయోజనాలు కాపాడుకోవడం... ఇదేనా మీ సనాతన ధర్మం? అని పవన్ ను రోజా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేర్వేరుగా వచ్చారంటేనే అర్థం అవుతుంది మీ వ్యూహం ఏమిటో అని వ్యాఖ్యానించారు.

## మిల్క్ షేక్ తయారుచేసిన రాహుల్ గాంధీ..

- మొదటి పేజీ తరువాయి

పాల ఉత్పత్తులు, మిల్క్ షేక్ ల తయారీలో పేరొందిన కెవెంటర్స్ స్టోర్ ను రాహుల్ గాంధీ గురువారం సందర్శించారు. ఢిల్లీలోని ఓ స్టోర్ ను సందర్శించిన రాహుల్ కు.. స్టోర్ సిబ్బంది మిల్క్ షేక్ ల తయారీ గురించి వివరించారు. ఆపై ప్రత్యక్షంగా చేసి చూపించేందుకు ప్రయత్నించగా.. సిబ్బందిని అడ్డుకుని తానే చేస్తానని రాహుల్ ముందుకొచ్చారు. స్టోర్ సిబ్బంది సూచనలతో మిల్క్ షేక్ తయారుచేసి కస్టమర్ కు అందించారు. కెవెంటర్స్ సంస్థ ఇటీవలే వందేళ్లు పూర్తిచేసుకుంది.. ఈ నేపథ్యంలో సంస్థ యాజమాన్యంతో ముచ్చటించారు. ఈ వీడియోను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అదికాస్తా వైరల్ గా మారింది.

## చెవిరెడ్డికి హైకోర్టులో షాక్.. క్వాష్ పిటిషన్ కొట్టివేత

- మొదటి పేజీ తరువాయి

అత్యా చారం జరిగిందని చెవిరెడ్డి వ్యాఖ్యానించారని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారని ఫిర్యాదులు రావడంతో పోలీసులు ఆయనపై పోక్సో కేసు నమోదు చేశారు. దీనిని కొట్టివేయాలంటూ చెవిరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. తాజాగా హైకోర్టు తీర్పు వెలువరించింది.

**చెవిరెడ్డిపై ఇదీ కేసు..**

తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలానికి చెందిన ఓ బాలిక (14) ఇటీవల తనపై దుండగులు దాడి చేశారని తల్లిదండ్రులకు చెప్పింది. స్కూలు నుంచి తిరిగి వస్తుంటే ముసుగు ధరించిన కొంతమంది వ్యక్తులు తనను అడ్డుకుని, మత్తుమందు తాగించారని తెలిపింది. ఈ విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సదరు బాలిక చదివే స్కూలుకు వెళ్లారు. బాలికపై అత్యాచారం జరిగిందని వ్యాఖ్యానించారు. బాధితురాలికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో స్పందించిన పోలీసులు సదరు బాలికకు వైద్య పరీక్షలు

జరిపించారు. అయితే, బాలికపై అత్యాచారం జరగలేదని వైద్యులు నివేదిక ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి పూర్వాపరాలు తెలుసుకోకుండా బాలికపై అత్యాచారం జరిగిందని వ్యాఖ్యానించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో బాలిక తండ్రి చెవిరెడ్డిపై ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు చెవిరెడ్డిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

## రోజా కూడా తిరుమల పవిత్రత గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది

- మొదటి పేజీ తరువాయి

కూడా తిరుమల పవిత్రత గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. ఈరోజు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ%౯%ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తెచ్చిన రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రధానితో శంకుస్థాపన సమయంలోనే అధికారుల నిర్లక్ష్యంతో తిరుపతిలో దురదృష్టకర సంఘటన జరగడం బాధాకరం అని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఘటనకు బాధ్యులైన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసి, ముగ్గురు అధికారులపై బదిలీ వేటు వేసిందని తెలిపారు. అలాగే చనిపోయినవారికి రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా, గాయపడినవారికి రూ. 5 లక్షల పరిహారం ప్రభుత్వం అందిస్తోందని పంచుమర్తి అనురాధ అన్నారు. 31 క్రిమినల్ కేసులతో 16 నెలలు జైల్లో ఉన్న జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రకు ఏం చేశాడో సమాధానం చెప్పాలని ఆమె ప్రశ్నించారు.

ప్రజాధనం వృథా చేసి రూ. 500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్న జగన్ %ఆ% కో కబ్జాల బాగోతం ఉత్తరాంధ్ర ప్రజలందరికీ తెలుసునని దుయ్యబట్టారు. వైసీపీ అధినేత జగన్, అనుచరులు, ముఖ్యంగా రోజా డ్రామాలు ఆడేందుకు పరామర్శ నెపంతో ప్రజలను ఇబ్బంది పెట్టడానికి వెళ్లారా? అని ఆమె నిలదీశారు. ఊహించని సంఘటనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న వైసీపీ నేతలకు వారి హయాంలో జరిగిన గోదావరి బోటు ప్రమాదం, అన్నమయ్య డ్యామ్ గేటు కొట్టుకుపోవడం, రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత వంటి నిర్లక్ష్యంతో జరిగిన మరణాలు గుర్తు లేవా? అని ప్రశ్నించారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనపై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్న వైసీపీ నేతలని అసలు మనుషులంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి %ఆ% కో చేసినట్టు కూటమి ప్రభుత్వంలో ఎవరు కూడా పవిత్ర తిరుమల ప్రసాదాన్ని రాజకీయ అవసరాలకు వాడలేదన్నారు. టిక్కెట్లు అమ్ముకోలేదని, తిరుమలలో రాజకీయాలు మాట్లాడడం వంటివి చేయలేదని గుర్తు చేశారు. తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన వైసీపీ నేతలు తిరుమల, వెంకటేశ్వరస్వామి, భక్తుల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆమె అన్నారు. డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమలలో అహంభావంతో తిరిగిన జగన్‌కు నిజంగా స్వామి మీద భక్తి ఉందా? అని ప్రశ్నించారు.

## ఏపీ ప్రజలకు ప్రధాని మోదీ వెన్నుపోటు

- మొదటి పేజీ తరువాయి

హోదా ఇస్తామని మోసం చేశారు. మొన్న మోదీ విశాఖ వచ్చినప్పుడు కనీసం విభజన హామీలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. విశాఖ స్టీల్ మీద ఎటువంటి ప్రకటన లేదు. ప్రైవేటీకరణ మీద వైఖరి ఏంటో చెప్పలేదు. ఉత్తరాంధ్ర–రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు గురించి మాట్లాడలేదు. కడప స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడలేదు. అలాంటి పార్టీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. ఇదెక్కడి న్యాయం. ఏపీ ప్రజలను దారణంగా మోసం చేసిన మోదీతో చంద్రబాబుది సక్రమ సంబంధం అయితే... జగన్‌ది అక్రమ సంబంధం. బడుగు బలహీన వర్గాల ఓట్లతో గెలిచిన జగన్... రాజశేఖర్ రెడ్డి ఆశయాలను గంగలో కలుపుతున్నారు. రాజశేఖర్ రెడ్డి గారు మతతత్వ

బీజేపీని నిరంతరం వ్యతిరేకించారు. ఆయన వారసులమని చెప్పుకునే జగన్ బీజేపీతో ఎందుకు కొమ్ముకొస్తున్నారు. రాజశేఖర్ రెడ్డి వారసుల్లో బీజేపీని వ్యతిరేకిస్తుంది నేను మాత్రమే. ఈ రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక విధానాలపై పోరాటం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. మన దేశాన్ని రక్షించుకోవాలి అంటే కాంగ్రెస్ పార్టీ అవసరం" అని షర్మిల పేర్కొన్నారు.

## క్షమాపణలు చెప్పడంలో తప్పులేదు!

- మొదటి పేజీ తరువాయి

చెప్పడంలో తప్పులేదని, క్షమాపణలు చెప్పినంత మాత్రాన చనిపోయిన వారు తిరిగి రారన్నారు. ఎవరో ఏదో మాట్లాడారని అన్నింటికి స్పందించాల్సిన అవసరమైతే లేదన్నారు.

తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ... తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్నారు. చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. తప్పిదం జరిగిందని, ఎలా జరిగిందనేది విచారణలో వెల్లడవుతుందన్నారు. విచారణను త్వరగా పూర్తి చేయాలని సీఎంను కోరుతామన్నారు. ఆ తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే న్యాయవిచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూస్తామన్నారు. మృతుల కుటుంబాలకు చెక్కులు సిద్ధం చేశామని, శనివారం ఉదయం వారి ఇళ్లకు వెళ్లి వాటిని అందజేస్తామన్నారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇస్తామని తెలిపారు.

## ఢిల్లీలో పాతికేళ్లుగా బీజేపీకి అధికారం దక్కలేదు... అందుకే ద్వేషం పెంచుకుంది

- మొదటి పేజీ తరువాయి

కేజ్రీవాల్ విమర్శించారు. అందుకే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీని నేర రాజధానిగా మారుస్తోందని మండిపడ్డారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, గ్యాంగ్ వార్‌లు నిత్యకృత్యమైన నేపథ్యంలో మహిళలు ఇంట్లో నుంచి బయటకు అడుగు పెట్టాలంటే భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోహింగ్యా చొరబాటుదారుల పేరుతో పూర్వాంచలి, దళితుల ఓట్లను పెద్ద ఎత్తున తొలగిస్తున్నట్లు ఆరోపించారు. ఈ చర్యలతో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ఆపార్ట్‌మెంట్లకు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవడానికి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నిధులు మంజూరు చేస్తామన్నారు.

# వైకుంఠ ఏకాదశి పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



**పలమనేరు జనవరి 10,(పెన్ పవర్):**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలలో పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీ భూనీళా కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో స్థానిక నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆదేవున్ని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలమనేర్ బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ,పట్టణ టిడిపి నాయకులు ఆర్.బి.సి. కుట్టి,గిరిబాబు, మదన్,కిరణ్,బీ.ఆర్. సి.కుమార్, గిరిధర్, సుధాకర్,మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్

నెల్లూరు | తిరుపతి | చిత్తూరు

## వార్డు ఉద్యోగుల సమస్యలపై మున్సిపల్ కమీషనర్‌తో చర్చించిన ఏపీఎన్జీజిఓ సంఘం





**పలమనేరు జనవరి 10,(పెన్ పవర్)**

మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గానూ పలమనేరు ఏపీఎన్జీజీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు,జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ ల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమీషనర్ ను కలిసి చర్చించారు. ఈ సమావేశంలో పండుగ సెలవులలో సిబ్బందికి విధులు కేటాయించడం పైన, కార్యాలయ పని వేళలు పొడిగించిన అంశం పైన,సిబ్బందికి అర్హమైన సెలవుల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందులపైన ఉద్యోగ సంఘాల నాయకత్వం మున్సిపల్ కమీషనర్ ఎన్.వి.రమణారెడ్డి తో చర్చించడం జరిగింది. కమీషనర్ అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లుగా మున్సిపల్ కార్యాలయం వెలుపల నిర్వహించిన ప్రెస్ మీట్ నందు సంఘ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా గ్రామవార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ, ఏపీఎన్జీజీఓ జాయింట్ సెక్రటరీ హైదర్, పలువురు వార్డు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 10**

ముక్కోటి ఏకాదశి పర్వదినాన పురస్కరించుకొని పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఉదయం నుండి శ్రీ లక్ష్మీనరసింహ దేవాలయంలో ఉత్తర ద్వారానా క్యూ లైన్ లో భారీ సంఖ్యలో పాల్గొని భక్తులు దర్శించుకున్నారు. అలాగే మండలంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపించేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత మందులు వాడకుండా ఆక్వా రైతులను చైతన్య పరచాలి

**- జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 09**

ప్రతి శనివారం ఆక్వా రైతులు ఉపయోగించే రసాయనాలు నిషేధిత యాంటీబయాటిక్స్ పై అవగాహన కార్యక్రమాలు అమలయ్యే విధంగా చర్యలు చేపట్టి నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ సెక్రటరీ ఏ హెచ్ డి డి అండ్ ఫిషరీస్ ఎం. నాయక్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి కోస్తా జిల్లాల జాయింట్ కలెక్టర్ ఆక్వా రైతులు వినియోగించే రసాయనాలు యాంటీబయోటిక్స్ నివారించే క్రమంలో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్లు, డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, యంపెడ, సిఏఏ, రెవెన్యూ, పోలీస్, జిల్లా మత్స్యశాఖ అధికారులు మండల స్థాయి అధికారులకు పలు సూచనలు చేస్తూ వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్ రెడ్డి, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గురువుల పవిత్రమైన ఆశీర్వాదాలే విద్యార్థులకు శ్రీరామరక్ష

**విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కోరుకునేది తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే -అల్లినగరం హైస్కూల్లో ఆనంద ఉత్సవాలతో సాగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం.**

**దేశ విదేశాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు -అలనాటి గురువులకు పాదాభిషేకం చేసి ఘనంగా సన్మానించిన పూర్వ విద్యార్థులు.**

**విద్యార్థులు చేసిన సన్మానం పాదాభిషేకంతో పులకించిపోయిన గురువులు -పూర్వ విద్యార్థులను అభినందించిన అల్లినగరం హైస్కూల్ హెడ్మాస్టర్ దాసరి గురుస్వామి.**













**కొమరోలు పెన్ పవర్ జనవరి 10**

గురువుల పవిత్రమైన ఆశీర్వాదాలు తమకు శ్రీరామరక్ష అని పలువురు పూర్వ విద్యార్థులు ప్రకటించి గురువుల పట్ల తమకున్న గౌరవాన్ని ,ప్రేమానురాగాలను చాటుకున్నారు. కొమరోలు మండలం అల్లినగరంలో గల మునుగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్లో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పాఠశాలలో 2000 -2005 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థులు కలిసి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు .ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు తెలుగు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో వివిధ వృత్తులలో ఉన్న పూర్వ విద్యార్థులందరూ తరలిరావడంతో పాఠశాలకు నూతన శోభ వచ్చినట్లుంది. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆత్మీయతగా పలకరించుకుంటూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యార్థులు గ్రూపులు గ్రూపులుగా ఫోటోలకు ఫోజు ఇచ్చి తమ ఐక్యతను చాటుకున్నారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హైస్కూల్ హెడ్మాస్టర్ దాసరి గురుస్వామి అధ్యక్షత వహించారు. అంతకుముందు తమ అలనాటి గురువులను పాఠశాల ప్రధాన గేటు వద్ద పూలమాలతో సన్మానించి పూల వర్షం కురిపిస్తూ, మేళ తాళాలతో ,విద్యార్థుల కేరింతలతో ,నృత్యాలతో వేదిక వద్దకు చేర్చారు .వేదికపై ఆసీనులైన తమ పూర్వ గురువుల కు పవిత్రమైన జలంతో పాదాభిషేకం చేసి, శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి గురువులపట్ల తమకున్న అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ అపూర్వ దృశ్యం విద్యార్థులను ఉపాధ్యాయుల కనువిందు చేయడమే కాకుండా భావోద్వేగానికి గురైనట్లు చేసింది. అనంతరం రిటైర్డ్ హెడ్మాస్టర్ పామూరు పల్లె వాసి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాడు చదువు చెప్పిన తమను జ్ఞాపకం ఉంచుకొని తమను ఆహ్వానించి పాదాభిషేకంతో ఘన సన్మానం చేయడం అభినందియమని, విద్యార్థులకు గురువుల పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు .విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును ,వారు ఉన్నత స్థానంలో ఉండాలని కోరుకునేది తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే అని అన్నారు. ఆ సందర్భంగా ఆయన ఆలపించిన పద్యాల తో విద్యార్థులు కేరింతలు కొట్టారు. మరో ప్రధానోపాధ్యాయుడు అహ్మద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధులను నిర్వర్తిస్తారని, విద్యార్థులు అందరిని పక్షపాతం లేకుండా సమాన దృష్టితో చూస్తూ వారిలో క్రమశిక్షణ ఉత్తమ గుణాలు అలవర్చేందుకు కృషి చేస్తారన్నారు. ఆ సందర్భంగా కొన్ని సందర్భాలలో విద్యార్థులను మందలించిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అల్లినగరం హై స్కూల్ ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ అనేక పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, గురువులను గౌరవించడం చూశానని ,అయితే గురువుల పాదాలను పవిత్రమైన నీటితో కడిగి పాదాభిషేకం చేసి ఆ నీటిని తలపై చల్లుకున్న విద్యార్థులను నేడు చూస్తున్నానని అంటూ పూర్వ విద్యార్థులందరినీ అభినందించారు . పూర్వ విద్యార్థులందరూ పాఠశాలలు చేరడంతో పాఠశాలకు కొత్త కళ వచ్చిందని అన్నారు .పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ సమావేశానికి రాష్ట్రం నలు మూలల నుంచి దేశ విదేశాల నుంచి విద్యార్థులు తరలి రావడం అభినందనీయమని ,దీనితో ఆనాటి గురువుల పట్ల వారికి ఉన్న గౌరవం ప్రేమానురాగాలు స్పష్టమవుతున్నాయన్నారు. ఆ కార్యక్రమంలో ఆనాటి గురువులు రమణ కుమార్ ,సత్యనారాయణ, రమాదేవి ,తదితరులు ఉపన్యసిస్తూ తమను ఆహ్వానించి పాదాభిషేకం చేసి ఘనంగా సన్మానించిన పూర్వ విద్యార్థులు అందరిని అభినందించి ఆశీర్వదించారు. అనంతరం పూర్వ విద్యార్థులు గతాన్ని ఆనాటి ఉపాధ్యాయులు తమ అందించిన విద్యాబోధన ,క్రమశిక్షణ, సమాజ సేవ లాంటి సద్గుణాలను జ్ఞాపకం చేసుకుంటూ ప్రస్తుతం చేస్తున్న వృత్తులను వారి జీవన విధానాన్ని పరిస్థితిని వివరించారు .పూర్వ విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్ను బహుకరించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ తో ఉన్న ఫోటో లను ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం తమ గురువులతో కలిసి గ్రూప్ ఫోటో తీయించుకున్నారు .కార్యక్రమానికి హాజరైన గురువులకు ,గ్రామ పెద్దలకు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ,పూర్వ గురువులకు విందుకు భోజనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను గండి చిన్న తిరుమలయ్య, గండి పెద్ద తిరుమలయ్య రెడ్డి చర్ల చంద్రశేఖర్ రాజు (అజార్) ,సానే మల్లికార్జున ,రెస్టారెంట్ ఎస్కే నాయబ్ రసూల్ ,కవలకుంట్ల మధుబాబు ,జంగల గురువారెడ్డి, ఏవియల్ నారాయణ, శ్రీనివాస రెడ్డి, బాల సింగరయ్య ,బాలరాజు, శేఖర్ రాజు ,కదిరిపోగు తిరుమలయ్య ,దాసరి మాలకొండయ్య, చల్లా సింగరయ్య, మహబూబ్ బాషా , హసీనా ,అక్కి సీత, పార్వతి రెడ్డి , తదితరులు పర్యవేక్షించారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకొని మళ్లీ విడిపోతున్నందుకు కొందరు విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

# యాదవుల ఆత్మీయ సమావేశం









**కొనకనమిట్ల పెన్ పవర్ జనవరి 10**

కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ యాదవ సత్రంలో శుక్రవారం యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రిటైర్డ్ ఐజి అధికారి పిన్నిక హరికుమార్ పాల్గొన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సత్రంలో జరిగినటువంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విచ్చేసిన భక్తులను ఎంతో అలరించాయి. సాంస్కృతి కార్యక్రమాల అనంతరం కమిటీ అధ్యక్షులు పిన్నిక హరికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తన తండ్రి హయం నుంచి సత్రాభివృద్ధికి తమ కుటుంబం ఈ ప్రాంత వాసుల మద్దతుతోటి అభివృద్ధి దిశలో పయనింపచేస్తుందని తన వంతు కర్తవ్యంగా తాను కూడా సత్రాభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. సత్రం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటి ముక్కోటి ఏకాదశి పండుగను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులతో చర్చించి నేడు హరిదాసుల,గంగిరెద్దుల ప్రదర్శన,పొట్టేళ్ల ప్రదర్శన, కోలాట ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సుదూర ప్రాంతానికి చెందిన భక్తులు ఈ కార్యక్రమానికి వచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పినిక హరికుమార్ నీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మి ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొనకణమిట్ల మండలంతో పాటు మార్కాపురం,పొదిలి,తర్లుపాడు,హనుమంతునిపాడు మండలాలకు సంబంధించిన యాదవులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోని సస్పెండ్ చేయండి అంటూ నిరసన వ్యక్తం చేసిన వైసీపీ సభ్యులు





**పలమనేరు జనవరి 10,(పెన్ పవర్):**

మండల ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం పలమనేరు రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని వైఎస్ఆర్సిపి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. పలు అభివృద్ధి పనులకు వర్క్ఆర్డర్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. జిల్లా అధికారులకు సైతం ఈ ఘటనపై ఫిర్యాదు చేసి ఉన్నామని తక్షణమే ఎంపీడీవో ఖాదర్ భాషాను సస్పెండ్ చేయాలని ఎంపీడీవో కార్యాలయం లోపల, బయట నిరసన వ్యక్తం చేశారు. ఇందులో వైసీపీ నాయకులు బాలాజీ నాయుడు,చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేయాలి

పోకూరి మాలకొండయ్య



**కందుకూరు పెన్ పవర్, జనవరి 10**

అర్హులైన పేదలందరికీ నివేషణ స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాలకొండయ్య అన్నారు. శుక్రవారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు స్థానిక సిపిఐ నియోజవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ కు సిపిఐ నాయకులు కార్యకర్తలు వివేసినా స్థలాలు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాలకొండయ్య మాట్లాడుతూ సొంత గృహాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఒక్కో నివాసంలో మా కుటుంబానికి చెందిన మూడు నాలుగు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని అలాంటి వారిని గుర్తించి వెనువెంటనే స్థలాలు మంజూరు చేసే గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు స్పందించిన డిప్యూటీ తాసిల్దార్ తాసిల్దార్ కు సమస్య వివరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆనందమోహన్, రామారావు, ఉప్పుటూరి మాధవరావు,బాల బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరు నియోజకవర్గం కాపు జేఏసీ యూత్ అధ్యక్షునిగా సాకిరి సాయి చందు నాయుడు ఎంపిక




**కందుకూరు పెన్ పవర్, జనవరి 10**

కందుకూరు నియోజకవర్గం కాపు జేఏసీ యూత్ అధ్యక్షునిగా సాకిరి సాయిచందునాయుడును ఎంపిక చేసినట్లు కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సాకిరి సాయి చందు నాయుడు మాట్లాడుతూ కందుకూరు పట్టణానికి చెందిన తనను ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. కాపు జాతి సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, కాపుల రాజ్యాధికారం కోసం వంగవీటి మోహనరంగా ఆశయాలకు అనుగుణంగా అందరిని సంఘటితం చేస్తూ ముందుకు సాగుతానని అన్నారు. ఈ అవకాశం కల్పించిన కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ చెన్నకేశవులకు పదోన్నతి

**కందుకూరు పెన్ పవర్, జనవరి 10**

మండలంలోని మాచవరం పశువైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ చెన్నకేశవులకు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా పదోన్నతి పొందారు. తూర్పుగోదావరి జిల్లాలోని చింతూరు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా పదోన్నతపై వెళ్లారు. వృత్తి పట్ల అంకితభావం, నిరంతరం కష్టపడే మనస్తత్వం, ఎల్లవేళలా పశుపోషకులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ఎంతో మంచి పేరు సంపాదించుకున్న డాక్టర్ చెన్నకేశవులకు ఈ పదోన్నతి రావడం పశుపోషకులు, రైతులు, మిత్రులు, సహ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతి రావడం పట్ల చెన్నకేశవులు స్పందిస్తూ బాధ్యత మరింత పెరిగిందని పశు పోషకులకు మరింత సేవలు అందిస్తానని అన్నారు. ఇప్పటివరకు తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున డాక్టర్ చెన్నకేశవులు ధన్యవాదాలు తెలిపారు.



# పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

## - రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 10**

పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి. డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. మద్దిపాడు గ్రామంలో రైతు మద్దా శివరామకృష్ణ నిర్మించుకున్న మినీగోకులం షెడ్డును కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, స్థానిక శాసనసభ్యులు బి. ఎన్. విజయ్ కుమార్ తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ నిధులతో రోడ్లు, కాల్వలు, చెక్ డ్యాములు, పశువుల షెడ్డుల నిర్మాణ పనులను చేపట్టామన్నారు. ఈ క్రమంలో జిల్లాకు 1131 షెడ్డులు మంజూరు అయ్యాయని చెప్పారు. వీటిలో 1040 పెడ్డులు ప్రారంభించామని, 474 షెడ్డులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి త్వరగా పూర్తి చేస్తామని, అవసరమైన వారికి కొత్త షెడ్డులను కూడా మంజూరు చేస్తామని ప్రకటించారు. రెండు పశువులు ఉన్నవారికి రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులు ఉన్న వారికి రూ.2.30 లక్షల విలువైన మినీగోకులం షెడ్డులను 90 శాతం రాయితీతో మూడు కేటగిరీలుగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదే విధంగా కోళ్లు, గొర్రెలు మేకల సంఖ్యను బట్టి వాటి పెంపకందార్లకు కూడా 70 శాతం రాయితీతో గోకులం షెడ్డులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త తయారు కావాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రాబాబునాయుడు లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులను ప్రోత్సహించి వారికి అవసరమైన పెడ్డుల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

సంక్రాంతి అంటేనే పశువుల పండుగ అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. అందుకే సంక్రాంతిలోపే వీటిని అందుబాటులోకి తెచ్చే చర్యలలో భాగంగా ఈ నెల 10, 11, 12 తేదీలలో పండుగ వాతావరణంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు చెప్పారు. పాడి రైతులను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, గతంలోనూ రైతులకు పైలేజ్ గడ్డిని అందించిందని ఆయన గుర్తు చేశారు. పశువుల షెడ్డులు నిర్మించుకునే స్థలం లేనివారికి వాటిని నిలిపి ఉంచేలా పశువుల హాస్టళ్లను ఏర్పాటు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. స్వయం శక్తితో ఎదిగేవారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జె.డి. బేబీరాణి, డ్వామా పి.డి, జోసఫ్ కుమార్, డి.పి.ఓ. వెంకట నాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, తహసీల్దార్ సుజన్ కుమార్, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామంలో సైడు కాలువలు అవసరమైన వీధులను వారు పరిశీలించారు.

# ముదిరాజ్ పాలెంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుక





**కందుకూరు పెన్ పవర్,జనవరి 10:**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు పట్టణం మదిరాజ్ పాలెంలో ఏకాదశి పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే మంగళ వాయిద్యాల మధ్య వేద పండితులు రామాలయం లోని కోదండ రామయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రమైన ఈరోజున భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కలియుగ దైవం విష్ణుమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. నగర ఊరేగింపుగా వస్తున్న స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. నిర్వాహకులు దేవతామూర్తులను ప్రత్యేక పూలలంకరణ చేయడంతో పుర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కొంగల నాగరాజు, రుద్రబోయిన రాజు, మోసంగి కోటేశ్వరరావు, కొండిబోయిన శ్రీనివాసులు, బయ్యా నాంచారయ్య, గుబ్బరబోయిన రామరాజు, బాలిబోయిన తిరుమలరావు, ప్రభాకర్, మోసంగి హరి, రుద్రబోయిన రాజు, పోతురాజు వెంకటేశ్వర్లు, మోసంగి ప్రసాద్, కృష్ణంరాజు, రుద్రబోయిన రాజు, బైనీడీ చిన్నారావ్, నరేష్, వేణు, బాల, హరిబాబు, గోవిందు, సాయిరాజ్, కార్తీక్, చంద్ర, ఓగూరు రమేష్, శ్రీను, నరసింహం, చెన్నయ్య, మాల్యాద్రి, వెంకటేష్, వెంకటేశ్వర్లు, గుణ, శివ, మధుబాబు, సాయిరాజ్, ప్రసాద్, అనీల్, సుధీర్ తోపాటు స్థానిక యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెలుగొండలో ఘనంగా ముక్కోటి ఏకాదశి మహోత్సవం



**కొనకనమిట్ల పెన్ పవర్ జనవరి 10**

వెలుగొండ పుణ్య క్షేత్రం శ్రీ వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ వెలుగొండ వెంకటేశ్వర భూదేవి స్వామికి దేవస్థానంలో ఆలయ అర్చకులు తిరుమలచార్యులతో దేవస్థానంలో వేద మంత్రాల నడుమ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు.స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టు పక్కల ప్రాంతాల వారితో పాటు మార్కాపురం,దొనకొండ,హెచ్‌ఎంపాడు,మండలం నుంచి ఉదయం నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కలు తీర్చుకున్నారు.దేవస్థానంలో ప్రతి ఏడాది నిర్వహించే ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు నూతనంగా ఉత్తర ద్వారం ఏర్పాటు చేయడంతో భక్తులు స్వామివారిని కనులారా తిలకించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐ.జి పిన్నిక హరి కుమార్ హాజరై స్వామివారి పూజలో పాల్గొన్నారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈవో చెన్నకేశవరెడ్డి,ఆలయ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లు చేశారు.వచ్చిన భక్తులకు దేవాలయం ఆవరణంలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# 150 మంది యాచకులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ





**కందుకూరు పెన్ పవర్, జనవరి 10**

150 మంది యాచకులకు స్టెయిన్లెస్ స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో పాటు అల్పాహారాన్ని కందుకూరు బాలుర ఉన్నత పాఠశాల 1973- 74, 10వ తరగతి స్నేహితుల బృందం పంపిణీ చేశారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక స్కందపురి శ్రీ జనార్ధన స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో దాదాపు 150 మంది యాచకులకు స్టెయిన్లె స్ స్టీల్ పళ్ళెములు, గ్లాసులతోపాటు అల్పాహారాన్ని అందజేశారు. ఈ బ్యాచ్ నిరంతరాయంగా వివిధ సేవా కార్యక్రమాలను కందుకూరు పట్టణ ప్రజలకు అందిస్తున్న విషయం విధితమే. ఈ బృహత్ కార్యక్రమంలో విశ్రాంత ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీరామ. రామమూర్తి, విశ్రాంత పంచాయతీరాజ్ డిఇ. మంచిరాజు వెంకట మురళీమోహన్, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి సందాని భాష,ముచ్చెలి ఉమా, మాజీ కౌన్సిలర్, ఆకిలి ఉమా, జనార్ధన స్వామి దేవాలయం చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు, గోనుగుంట. సుబ్రహ్మణ్యం, తటవర్తి. సత్యనారాయణ, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు వారి మిత్ర బృందం పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి





**పెన్ పవర్ పామూరు జనవరి 10**

సి.యస్.పురం మండలం, కోవిలంపాడు , మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానములో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు గఆధ్వర్యంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణుమూర్తి స్వామి వార్ల గరుడు వాహనం మీద వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, బయసాని మధు సూదన రావు మరియు గ్రామస్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శివ సాయి స్కూల్లో సంక్రాంతి సంబరాలు







**కందుకూరు పెన్ పవర్, జనవరి 10**

పట్టణములోని శ్రీ శివ సాయి పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్కూల్లో ముగ్గులు, భోగిమంటలు, పొంగల్లు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఓరుగంటి శివరామయ్య మాట్లాడుతూ తెలుగు పండుగ లలో అతిపెద్ద పండుగ సంక్రాంతి పండుగని అన్నారు. అందరూ సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిధులు దారి మళ్లింపుతో... అభివృద్ధి ఆమడ దూరంలో పంచాయితీలు

**కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు పూర్వ వైభవం**

**గ్రామాలే పట్టుకొమ్మలన్న మహాత్మాగాంధీ స్పూర్తితో ముందుకు**

**పెద్ద దోర్నాల గోకులం ప్రారంభం**

**అయిన ముక్కుల బీసీ కాలనీలో**

**సీసీ రోడ్లు, డ్రైన్లతో పాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**మంత్రి గొట్టిపాటి రవికుమార్**








**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 10**

గత వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్లించడంతో రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలన్నీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విమర్శించారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణం పూర్తి చేసుకున్న గోకులం షెడ్ ను మంత్రి ప్రారంభించారు. అదే విధంగా పక్కనే ఉన్న.. అయినముక్కల గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మోట్ల గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సిద్ధి మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రి గొట్టిపాటికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం మంత్రి గొట్టిపాటికి.. స్వామివారి శేష వస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు....**

ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా వివిధ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం ఈ సందర్భంగా విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ... గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు అన్న మహాత్మా గాంధీ మాటలను స్పూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయితీలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజ్ కాలువల నిర్మాణం, 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ద్వారా గ్రామాలను మరింత అభివ్రుద్ధి చేస్తున్నట్లు ఆయన వివరించారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో... గ్రామాలలో అభివ్రుద్ధి కుంటుపడిందన్నారు. సర్పంచ్ లను వేధించడమే కాకుండా సంబంధిత శాఖ ఉద్యోగులపైనా ఒత్తిడి పెంచారని ఆరోపించారు. పంచాయితీలలో కనీస మౌలిక సదుపాయాలూ లేక గ్రామీణ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం... గ్రామ పంచాయితీల అభివృద్ధి పై ప్రత్యేక ద్రుష్టి కేంద్రీకరించిందని మంత్రి స్పష్టం చేశారు. అందుకే పంచాయితీల నిధులను... సంబంధిత గ్రామాల అభివృద్ధి కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో... పంచాయితీలన్నీ మళ్లా పూర్వ వైభవం వైపు అడుగులు వేస్తున్నాయని తెలిపారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకూ... నగరాల్లో ఉండే విధంగా మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుతో పాటు ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పుల్లలచెరువు త్రిపురాంతకం ఎర్రగొండపాలెం పెద్ద ఆరవీడు కన్వీనర్లు పెద్దదోర్నాల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి ఎస్కే బాబు శేషాద్రి ఈదర మల్లయ్య చంటి దేశం నాగేంద్రబాబు జనసేన మండల కన్వీనర్ కేతి మురళి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు












**అర్ధవీడు, పెన్ పవర్ , డిశంబర్ 10**

ప్రకాశం జిల్లా, అర్ధవీడు మండలం, ముక్కోటి ఏకాదశి సందర్భంగా అర్ధవీడు గ్రామంలోనీ శ్రీ కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామికి ఆలయ పూజారి కృష్ణ మోహన్ వేదమంత్రాలతో శుక్రవారం గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు . ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున గ్రామ ప్రజలందరూ రామాలయానికి వెళ్లి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. పర్వదినం సందర్భంగా రామాలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ,తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ముక్కోటి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయ పూజారి మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పండుగ చాలా పవిత్రమైందని అన్నారు. విశేషమైన రోజు అని, వెంకటేశ్వర స్వామిని, లక్ష్మీ నరసింహా స్వామిని, సీతారాములను ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునే రోజు అని అన్నారు. ఈరోజు స్వామిని దర్శించుకుంటే విశేషముగా ఆశీస్సులు ఇస్తారని భక్తుల నమ్మకమని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానము, సహా వైష్ణవ ఆలయాల్లో విశేషంగా పూజలు జరుగుతున్నాయని. ఇక్కడికి భక్తులు భారీగా తరలివచ్చారని. వారందరి కోరికలు నెరవేరాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ప్రజలందరి కీ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పురవీదుల గుండా భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మోదాల మల్లికార్జున రావు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 10**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా; చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి; శ్రీవారి, అమ్మవారి ఉత్తర ద్వార దర్శనం భాగ్యం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు దంపతులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రకాశం జిల్లా రాష్ట్ర ప్రజలు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని; కోరుకుంటున్నట్టు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఆస్థాన అర్చకులు శ్రీమాన్ వెంకటహరి కుమారాచార్యులు ఆధ్వర్యంలో ,శ్రీవారి మహామండపం నందు సామూహిక శ్రీ సత్యన్నారాయణ వ్రతములు వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం ఏకాదశి పునస్కరించుకొని శ్రీ వారి మండలంలో; గోదాదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి,అమ్మవారికి ప్రత్యేక పూజలు,పాశురం సమర్పణ, తిరుప్పావై, విష్ణు సహస్ర నామ పారాయణం భక్తుల సహకారంతో నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, హరికృష్ణ శర్మ భక్తులకు అందజేశారు. ఉభయ దాతలు ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

## మున్సిపల్ కార్మికుల గత సమ్మె కాలపు

# ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలి !!!

**అప్పటి సమ్మెలో అపుడు ఇచ్చిన తెదేపా హామీ ఇచ్చిన మాట మరవద్దు**

**నిరసన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు**




**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 10**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పై సమ్మె చేయగా ఆ సమ్మెకు మద్దతు ప్రకటించి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తెదేపా ప్రభుత్వం ఇచ్చిన హామీని మర్చి పోయిందని సిపిఎం నాయకులు మున్సిపల్ నాయకులు ధ్వజమెత్తారు .గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం దగ్గర 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేయడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులు సమ్మె విరమింప చేసేందుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తో చేసుకున్న సమ్మె ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం దగ్గర ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం మురళి జి నాగయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 17 రోజులు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేయడంతో ప్రభుత్వం అనేక డిమాండ్లపై ఒప్పందం చేసుకొని నేటికీ ఆ డిమాండ్లు అమలు కోసం జీవోలు ఇవ్వలేదని ఆరోపించారు ఒప్పందం ప్రకారం సమస్యల పరిష్కారానికి జీ ఓలు విడుదల చేయాలని చేశారు. ఆమేరకు శుక్రవారం నాడు గిద్దల నగర పంచాయతీ కార్యాలయం దగ్గర నిరసన తెలియజేశారు. 2024 జనవరి 24వ తేదీన మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఫైల్స్ డిపార్ట్మెంట్ కు పంపించిన ఫైలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫైల్ వెనక్కి పంపించిందని పేర్కొన్నారు. గత సమ్మె సందర్భంగా అప్పటి ప్రతిపక్ష పార్టీ ఇప్పటి అధికార పార్టీ నాయకులు సమ్మె మద్దతుపలికి అనేక హామీలు ఇచ్చారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే మున్సిపల్ కార్మికులు సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందం అమలు చేస్తామని హామీ ఇచ్చారని 8 నెలలు గడిచిన సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆవులయ్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి పాపయ్య కే బాలయ్య డి వెంకటయ్య సుబ్బమ్మ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గోవిందమాంబ మహాదేవి అవతారణ దినోత్సవం







**దొనకొండ జనవరి 10 పెన్ పవర్**

మండల కేంద్రంలో అంబేద్కర్ బొమ్మ సర్కిల్లో శ్రీ ఆనంద ఆశ్రయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవం శ్రీ ఆనంద ఆశ్రమంలో వైకుంఠ ఏకాదశి శ్రీ గోవిందమాంబ మహాదేవి అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు తెల్లవారుజామున 5 గంటల నుండి శ్రీ గోవింద అమ్మ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి పంచామృత అభిషేకాలు అష్టోత్తర శతనామావళి పూజలు అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేసి కాళికాంబ సప్తశతి వీరబ్రహ్మేంద్రస్వామి వారి స్థానిక స్తోత్రం ప్రత్యేక పూజలు భజనలుచేసి మహా నైవేద్యంలు సమర్పించి సామూహిక హారతులు ఇచ్చారు వచ్చినభక్తులకు శ్రీ భైరవానంద స్వామి ప్రధాన అర్చకులు మణి బాబు శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## బంగారు బాల్యం పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి

**తాహసిల్దార్ రమణారావు**



**పెన్ పవర్ పామూరు జనవరి 10**

మండల స్థాయి విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి బంగారు బాల్యం కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చెయ్యాలని తహసిల్దార్ రమణారావు కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ప్రతినెల రెండవ శుక్రవారం మండల స్థాయి అధికారులు బంగారు బాల్యం కమిటి సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గోళ్ల .పద్మజ ఎంపీడీవో, విద్యాశాఖ, పోలీస్ శాఖ, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ సమన్వయంతో బంగారు బాల్యం మండల కమిటీ కృషి చేయాలని తహసిల్దార్ రమణారావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని, ,బాల్య వివాహాలన పై అవగాహన కలిగించాలని,బాల కార్మిక వ్యవస్థ పై దృష్టి సారించి బాలలంతా బడికి వెళ్ళేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని, తప్పనిసరిగా వివాహ నమోదు చట్టం పై అవగాహన కలిగించి గ్రామంలో జరుగు వివాహలను నమోదు చేయాలని తీర్మానం చేశారు.కార్యక్రమంలో విద్యాశాఖ ప్రతినిధి రవి, ఎంపీడీవో కార్యాలయ ప్రతినిధి సుచరిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు అర్ధవీడులో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అర్ధవీడు, పెన్ పవర్ , డిశంబర్ 10**

అర్ధవీడు మండలం నందు 33 కేవీ ఫీడర్ లో అత్యవసర మరమ్మత్తుల కారణంగా రేపు అనగా 11.01.25 శుక్రవారం ఉదయం 09:00 గంటల నుండి 10:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అర్ధవీడు విద్యుత్ శాఖ ఒక ప్రకటన లో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాము. కనుక విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించగలరని ఆశిస్తున్నాము.

# శ్రీగిరిలో ఘనంగా ముక్కోటి వేడుకలు

– శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనంతో భక్తుల పులకరింత – ఫలించిన శీఘ్ర దర్శనం టోకెన్ జారీ విధానం









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 10**

శుక్రవారం ముక్కోటి పర్వ దినాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు తెల్లవారు జామునుండే ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీని ముందే ఊహించి శీఘ్ర దర్శనం పేరిట రెండు రోజుల ముందుగానే ఆలయ నిర్వాహకులు టోకెన్లు జారీ చేయడంతో భక్తులు సులభముగా శ్రీవారిని దర్శించుకున్నారు. గరుడ వాహనం పై ఉభయ దేవేరులతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్తర ద్వారంలో దర్శనమివ్వడంతో భక్తులు పులకరించి పోయారు. శ్రీగిరి ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. 20 వేలమంది భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నట్లు అంచనా. శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి , కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణా రావు,ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారిలతో పాటు ఆలూరు జై శంకర్ , ఆలయ అర్చకులు వేద పండితులు సిబ్బంది పర్యవేక్షించారు.

## విద్యుత్ చౌర్యం పై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు



**పెన్ పవర్ పామూరు జనవరి 10**

పామూరు మండలంలో పలు గ్రామం నందు శుక్రవారం విద్యుత్ చౌర్యం పై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు ఈ ఈ వీరయ్య అధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు . ఈ దాడుల్లో కనిగిరి ఈ ఈ హైమావతి విచ్చేశారు . ఈ సందర్భంగా ఈ ఈ హైమావతి మాట్లాడుతూ సిబ్బంది మొత్తం 23బృందాలుగా ఏర్పడి 720 సర్వీసలను తనీఖి చేసారు, ఇందులో 62మంది అధిక లోడ్ లు వాడుతున్నట్లు గుర్తించి వారికి నోటీసులు ఇచ్చారు, విద్యుత్ చౌర్యం చేస్తున్న 8మంది పై కేసులు నమోదు చేసారు వారు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ ను అక్రమం గా వాడకూడదు అలా వాడిన వారు శిక్షార్హులు, వినియోగదారులు వారి యొక్క బిల్లులను సకాలంలో చెల్లించి సంస్ధకు సహకరించవలసిందిగా సూచించారు మరియు పీఎం సూర్యఘర్ పథకంను ప్రతి ఒక్కరు వినియోగించుకోవలసిందిగా కోరారు.ఈ తనీఖలలో పాముర డివై.ఈ.ఈ . డి వి క్రిష్ణారెడ్డి,కనిగిరి డివై ఈ ఈ ఉమాకాంత్ ,మరియు విజిలెన్స్ డివై ఈ ఈ, ఏ ఈ ఈ లు ,మండలలా ఏ ఈ ఈ లు పాల్గొన్నారు.

## పొదిలి వెంకటేశ్వర ఆలయంలో అనిల్ దంపతుల ప్రత్యేక పూజలు



**పొదిలి, పెన్ పవర్ జనవరి 10**

పొదిలి పట్టణంలోని శ్రావణి ఎస్టేట్ లో గల లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నాడు రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, సురేఖ దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా అనిల్ కుమార్ దంపతులు వెంకటేశ్వర స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం లోని ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మార్కాపురం శాసనసభ్యులు నారాయణరెడ్డి తో పాటు రాష్ట్రంలోని మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ క్షేమంగా ఉంటూ, ప్రజలకు చక్కటి పరిపాలన అందించే విధంగా చూడాలని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు అనిల్ కుమార్ దంపతులు వెంకటేశ్వర దేవస్థానానికి చేరుకోగానే ఆలయ అర్చకులు వారిని సాదరంగా స్వాగతం పలి కి, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపించారు ఈ కార్యక్రమంలో ఇతర భక్తులు కూడా పాల్గొన్నారు.

## కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



**పీసీపల్లి పెన్ పవర్ జనవరి 10**

భోగి ,సంక్రాంతి మరియు కనుమ పండుగ సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై జి కోటయ్య హెచ్చరించారు. శుక్రవారం గతంలో కోడిపందాలు ఆడుతూ దొరికిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందాలు నిర్వహిస్తే గేమింగ్ చట్టం 1947, జంతు హింస నివారణ చట్టం 1960 ప్రకారం క్రిమినల్ చర్యలు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. మండల ప్రజలందరూ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సుఖ సంతోషాలతో జరుపుకోవాలని పోలీస్ శాఖ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. మండలంలో ఎక్కడైనా కోడిపందాలు గానీ, పేకాటలు గాని మరి ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వ్యక్తులు మరియు పాల్గొన్న వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని కోరారు.

## తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఎం పి మాగుంట

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 10**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్ర వారం ఉదయం తిరుమల లోని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.



## వైకుంఠ ఏకాదశి సందర్భంగా అయ్యప్ప స్వామి దేవస్థానంలో పెద్ద పడిపూజ నిర్వహించిన బైరెడ్డి, దారపనేని





**పెన్ పవర్ పామూరు జనవరి 10**

కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భముగా పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పెద్ద పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిమట పట్టాభి స్వామి, చిమట కార్తీక్ స్వామి పేద మంత్రాలతో అయ్యప్ప స్వామి దేవస్థానం దద్దరిల్లేలా పెద్ద పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. మొట్టమొదటిగా విఘ్నేశ్వర స్వామి పూజతో మొదలుపెట్టి, సుబ్రహ్మణ్యస్వామి, మాళికాపుర మాత, నాగదేవత లకు ఘనంగా వేద పండితుల వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. దేవస్థానం గౌరవ అధ్యక్షులు విశ్వనాథుని సత్యనారాయణ (మణికంఠ స్వామి) పర్యవేక్షణలో దేవస్థానం చైర్మన్లు కావిటి వెంకటసుబ్బయ్య, గుత్తి వెంకటరాజా పెద్ద పడిపూజ కార్యక్రమం ఆద్యాతం ఏర్పాట్లను పర్యవేక్షించారు. అయ్యప్ప స్వామి దేవస్థానంలో 18 మెట్లకు ప్రతి మెట్టు కు పడిపూజ వెలిగించి స్వామివారి కృపకు బైరెడ్డి, దారపనేని పాత్రులైనారు. పెద్ద పడిపూజ కార్యక్రమాన్ని వీక్షించుటకు అయ్యప్ప స్వాములు భారీ ఎత్తున పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద పడిపూజ అనంతరం అయ్యప్ప స్వాములకు, సివిల్ స్వాములకు బైరెడ్డి జయరామిరెడ్డి ఉదయం అల్పాహారం భిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్లు కావిటి వెంకటసుబ్బయ్య, గుత్తి వెంకటరాజా, మన్నం రమణయ్య, ఓగూరి ఏడుకొండలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి అనగాని కృషి అమోఘం

రెవిన్యూ మంత్రి జన్మదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 10**

ప్రజాసేవ లక్ష్యంగా, పేదల అభ్యున్నతికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అనునిత్యం కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం రేపల్లె ఎమ్మెల్యే అనగాని క్యాంపు కార్యాలయంలో మంత్రి జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే ఏలూరి హాజరయ్యారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మంత్రి అనగానికి తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో అనగాని మంత్రిగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంచలన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను గుర్తించి రైతాంగ శ్రేయస్సు కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచి ప్రజాసేవకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. పేదల సేవే పరమావధిగా పనిచేస్తూ రేపల్లె ప్రజలకు ఆపద్బాంధవుడుగా నిలిచారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అనగాని చేస్తున్న కృషి అమోఘం అన్నారు. ఒకవైపు నియోజకవర్గ అభివృద్ధి మరోవైపు ప్రజాసేవ.. మంత్రిగా ప్రజలకు ప్రభుత్వ లక్ష్యాలు చేరవేయడంలో నిరంతరం మంత్రి అనగాని పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు , హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్ శాఖ గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ, ఉగ్ర నరసింహారెడ్డి, నక్క ఆనంద్ బాబు, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యజ్యోతి ప్రమోషన్ విషయమై త్వరలో నిర్ణయం

– ఉద్యోగ సంఘ నేతలకు ఎస్ ఇ హామీ

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 10**

గత నాలుగు నెలలుగా పెండింగ్లో ఉన్న దివ్య జ్యోతి ప్రమోషన్ పై సూపరిండెంట్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ సర్కిల్ ఎస్ఈ సానుకూలంగా స్పందించారు. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రమోషన్ విషయంలో తగు చర్యలు తీసుకుంటానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం నాయకులకు ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం సూపరిండెంట్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ సర్కిల్ ఒంగోలు ఎస్ఈ ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా.. టౌన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న దివ్య జ్యోతి ప్రమోషన్ గురించి మాట్లాడటం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.వరకుమార్, కోశాధికారి ఈదర విజయభాను, ఒంగోలు పట్టణ కార్యదర్శి మోటా, ఈదర శ్రీనివాసరావు, యం. యేసురత్నం, మన్నం చెంచరావు, సుమతి, ప్రసన్న కుమారి, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆ పది మందికి మంత్రులకు డేంజర్ బెల్స్



**విజయవాడ, జనవరి 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే కొందరు మంత్రులతో ప్రభుత్వానికి తలనొప్పులు తప్పడం లేదు. పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధుల వంటి విషయాల్లో ప్రభుత్వం సాధించిన విజయాల కంటే కొందరు మంత్రుల వ్యవహారాలకే జనంలో ఎక్కువ పబ్లిసిటీ లభించింది. ముఖ్యమంత్ర పదేపదే చెబుతున్నా వాటిని పట్టించుకోకుండా సాగిస్తున్న వ్యవహారాలతో చికాకులు తప్పడం లేదు. ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడం అంత సులువుగా ఏమి జరగలేదు. ఐదేళ్లు ప్రతి పక్షంలో సవాళ్లు, అవమానాలు, కష్టాలని అధిగమించి అధికారంలోకి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు 53 రోజుల పాటు జైలు జీవితాన్ని కూడా అనుభవించాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు ఆర్నెల్ల లోనే ఈ విషయాలు మర్చిపోయినట్టు వ్యవహరిస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు దూరంగా ఉండాలని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని ముఖ్య మంత్రి పదేపదే చెబుతున్నా కొందరి తీరు మాత్రం మారడం లేదు. ఆర్నెల్లలోనే దాదాపు పది మందికి పైగా మంత్రుల పని తీరుపై తీవ్ర ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో వారి పేర్లపైనే ఎందుకు చర్చ జరుగుతోందనే వాదన కూడా లేకపోలేదు. ఇప్పటి వరకు ఆరోపణలు వచ్చిన వారంతా ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారే కావడం మరో రకమైన చర్చకు కారణం అవుతోంది. ఏపీ మంత్రుల్లో అందరి కంటే ముందు రవాణా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అందరికంటే ముందు వార్తల్లో నిలిచారు. మంత్రి భార్య ఎస్కార్ట్‌గా రాలేదని పోలీస్ అధికారిని దుర్భాషలాడటం చర్చనీయాంశం అయ్యింది. ఆ తర్వాత అదే బాటలో ఇతర మంత్రులు నడిచారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో చాలామంది తొలిసారి మంత్రి పదవుల్ని దక్కించుకున్న వారే ఉన్నారు. సీనియర్లను కాదని జూనియర్లకు మంత్రి పదవులు ఇస్తే వారంతా సొంత వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మంత్రులంతా అదే ఫాలో అవుతున్నారు. ఏదొక వివాదాన్ని తలకు ఎత్తుకుంటున్నారు. రామ్ ప్రసాద్ రెడ్డి తర్వాత వాసం శెట్టి సుభాష్ వ్యవహార శైలిపై టీడీపీ అధినేత చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సీనియర్లను కాదని టీడీపీల వాసంశెట్టి సుభాష్‌కు అవకాశం కల్పించడంతో సొంత పార్టీ నేతలు ఆయనకు వ్యతిరేకంగా మారారు. ఆ తర్వాత మంత్రి పార్థ సారధి, హోంమంత్రి అనిత, రెవిన్యూ మంత్రి ఆనగాని సత్యప్రసాద్, సివిల్ సప్లైస్ మంత్రి నాదెండ్ల, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇలా ఒకరి తర్వాత ఒకరు కూటమి పార్టీల్లో నేతలు వార్తల్లో నిలిచారు. అయా శాఖల్లో అవినీతి వ్యవహారాలపై పత్రికల్లో ప్రముఖంగా కథనాలు రావడమో, మంత్రులు సంబంధం లేని వ్యవహారాల్లో తల దూర్చి బొప్పి కట్టించుకోడమో జరిగాయి. కొన్ని శాఖల్లో మంత్రులు శృతి మించి సంపాదనపై పడ్డారనే ప్రచారం జరగడంతో ప్రభుత్వానికి ఆర్నెల్లలోనే బోలెడు అప్రతిష్టను మూటగట్టేలా చేసింది. పోస్టింగులు, ప్రమోషన్లలో కొందరు మంత్రులు గల్లాలు తెరవడం, ఆ విషయాలు బయటకు పొక్కడం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేలా చేసింది. అయితే మంత్రుల అవినీతి వ్యవహారాల్లో కొందరి పేర్లే ప్రముఖంగా బయట ప్రచారం జరగడం కూడా వ్యూహాత్మకమేనని భావన కూటమి పార్టీ నేతల్లో ఉంది. అయా పార్టీల్లో అంతర్గతంగా ఉన్న పరిస్థితులతో పాటు సమయం దాటిపోతే మళ్లీ అవకాశం వస్తుందో రాదోననే ఆందోళనతోనే మంత్రులు రెచ్చిపోతున్నారనే వాదన ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో తాము చేసిన పొరపాట్లు, తప్పుల్ని కవర్ చేయడానికి కులం, సామాజిక కార్డులను తెరపైకి తీసుకురావడం కూడా అయా పార్టీలకు కొత్త చిక్కులకు కారణమవుతోంది. తాము మాత్రమే తప్పు చేస్తున్నామా, మిగతా వారు శుద్ధపూసలా తరహా చర్చలతో ప్రధానంగా టీడీపీ ఇరకాటంలో పడుతోంది. కీలక శాఖలు, బాధ్యతలన్నీ కొందరి చేతుల్లో ఉంటే నిధులు లేని, ప్రాధాన్యత శాఖలపై ప్రచారం ఏమిటని వాదిస్తున్నారు. దీంతో అటు ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావంతో పాటు కూటమి పార్టీల తీరుపై ప్రజల్లో చర్చ జరుగుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

## ఏపీ ఫుట్ బాల్ టోర్నమెంట్-2024-25 ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో

# "కడప కెప్టెన్ పవన్ కుమార్ " టీం గెలుపు

**కడప, జనవరి, 10 .( పెన్ పవర్ డెస్క్ )** ఏపీ ఫుట్బాల్ టోర్నమెంట్ 2024 -25 సంవత్సరానికి గాను ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్ డి టి గ్రౌండ్లో రెండు రోజులు ఫుట్బాల్ పోటీలు కడప అనంతపురం నెల్లూరు చిత్తూరు కర్నూలు మొదలైన ఇంటర్ ఫుట్బాల్ టోర్నమెంట్ జరగగా అందులో కడప పవన్ కుమార్ కెప్టెన్ సారథ్యంలో ప్రథమ బహుమతి సాధించినట్లు టీమ్ మేనేజర్ మురళి ఆనందం వ్యక్తం చేశారు.




# పార్టీలో నేతలు చెరో దారి



**కాకినాడ, జనవరి 10, పెన్ పవర్:** తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా పేరు పడింది. పార్టీ పుట్టినప్పటి నుంచి 1999, 2019 మినహా ప్రతి ఎన్నికలోనూ టిడిపినే ఇక్కడ గెలిచింది. పార్టీ కష్టాల్లో ఉన్న 2004,2009లో సైతం కొవ్వూరులో తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. అలాంటి చరిత్ర ఉన్న కొవ్వూరులో టీడీపీని చేజేతులా పార్టీ అధిష్టానమే నాశనం చేసుకుంటుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కారణం అక్కడ పార్టీలో పెరిగిపోయిన వర్గ పోరు.. కుమ్ములాటలు. కొవ్వూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరైనా అక్కడ శాసనం మాత్రం దొమ్మేరు దివాణందే. దొమ్మేరు జమీందార్లుగా పేరున్న పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు), ఆయన సోదరుడు అచ్చిబాబు చెప్పిన మాటే వేదంగా అక్కడ చెల్లుబాటు అయ్యేది. కృష్ణ బాబు ఐదుసార్లు కొవ్వూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొవ్వూరు ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. అప్పటి నుంచి టీవీ రామారావు, ఖా జవహర్, తానేటి వనిత (వైసీపీ), ముప్పిడి వెంకటేశ్వర రావు కొవ్వూరు నుంచి గెలిచారు. వీరి గెలుపు వెనుక ఉన్నది పెండ్యాల కుటుంబమే అన్నది బహిరంగ రహస్యం. దాదాపు 23 ఏళ్ళు ఓ౦ం గా పని చేసిన చరిత్ర ఉన్న కృష్ణ బాబు అనూహ్యంగా 2012లో వైసీపీలో చేరారు. దీంతో కంగారుపడిన టిడిపి శ్రేణులకు ఆయన సోదరుడు అచ్చిబాబు అండగా నిలబడ్డారు. ఆ తర్వాత ఎన్నికల్లో ఖా జవహర్ టీడీపీ నుంచి గెలిచి మంత్రి అయ్యారు. 2019లో జగన్ హవాలో తానేటి వనిత కొవ్వూరులో గెలిచి హోం మంత్రి అయ్యారు. ఆ గెలుపు వెనక ఉన్నది కృష్ణ బాబు అల్లుడు రాజీవ్ కృష్ణ అని ఆయన వర్గం ప్రచారం చేసుకుంది. ఆ టైంలో వైసిపిలో రాజీవ్ కృష్ణ ఒక వెలుగు వెలిగారు. అయితే 2024లో సీన్ మారింది. కూటమి ప్రభంజనంలో టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఇక్కడ నుంచి గెలిచారు. ఆ గెలుపునకు అచ్చిబాబు మద్దతు తోడ్పడింది. ఈ తరుణంలో కృష్ణబాబు మృతి చెందడం, ఆయన అల్లుడు రాజీవ్ కృష్ణ టిడిపి గూటికి చేరడం జరిగిపోయాయి. అయితే ఈ చేరిక తనకు తెలియకుండానే జరిగిందని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తనను కలిసిన కార్యకర్తలతో చెప్పినట్టు తెలుస్తోంది. అటు అచ్చిబాబు కూడా అధిష్టానం వైఖరితో అలకబూనారు. 2019-24 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నప్పుడు వారికి అండగా నిలబడింది స్థానిక తెలుగుదేశం నాయకులు. అయితే తమకు తెలియకుండా రాజీవ్ కృష్ణను అధిష్టానం పార్టీలో చేర్చుకోవడంపై వారు మనస్థాపం చెందినట్టు చెబుతున్నారు. ఎవరైతే తమని ఇబ్బందులు పెట్టారో వాళ్లకి పార్టీలో పెద్దపీట వేయడం ఏంటనేది వారి వాదన. మరోవైపు అన్ని సర్దుకుంటాయని పార్టీ హై కమాండ్ భావిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆలా కనిపించడం లేదు. మొదటి నుంచి మాజీ మంత్రి జవహర్‌ను కొవ్వూరు టీడీపీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. ఇప్పుడు రాజీవ్ కృష్ణ, జవహర్ ఏకం అయ్యారు అనేది వారి వెర్షన్. రాజీవ్ కృష్ణ, జవహర్ ఆశీస్సులతో సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీలు వెలియడాన్ని సాక్ష్యంగా చెబుతున్నారు. నిజానికి 2024లో కొవ్వూరు సీటు తనకే అని జవహర్ భావించారు. 2019 ఓటమి తర్వాత టిడిపిలో బలంగా వాయిస్ వినిపించిన వాళ్లలో ఆయన ఒకరు. కానీ గోపాలపురం నుంచి వచ్చిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు అధిష్టానం ఎమ్మెల్యే సీటు ఇవ్వడంతో జవహర్ సైలెంట్ అయ్యారు. అంతా చల్లబడింది అనుకున్న సమయంలో కొవ్వూరులో కొత్త గ్రూపులు బయలుదేరడం నియోజకవర్గంలో కుమ్ములాట్లకు కారణమైంది. వైసీపీని ఇబ్బందులు పెట్టాలనుకునే ప్రయత్నంలో ఆ పార్టీ నాయకులను ఆకర్షించి సొంత పార్టీలో కుమ్ములాట్లకు కారణం అవుతోంది అధ్దిష్టానం అనేది కొవ్వూరు పరిస్థితులను గమనిస్తున్న వారి విశ్లేషణ. టిడిపి హై కమాండ్ మేల్కొని కొవ్వూరు గ్రూపు తగాదాలకు వెంటనే ఫుల్ స్టాప్ పెట్టకపోతే పార్టీ కంచుకోటగా ఉన్న కొవ్వూరు చేజారిపోయే ప్రమాదం లేకపోలేదు.

## తొక్కిసలాట వెనుక అనుమానాలు




**తిరుపతి, జనవరి 10, పెన్ పవర్:** తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మరణించిన ఘటన అందరినీ కలచి వేసింది. నిజంగా ఇది దురదృష్టకరమే. కానీ ఇందులో గత ప్రభుత్వం నిర్వాకం కారణం కూడా ఉందన్నది వాస్తవం. గతంలో ఎన్నడూ లేని విధంగా 2019 నుంచి 2024 మధ్య కాలంలోనే తిరుమలలో ఈ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. గతంలో వైకుంఠ ఏకాదశికి ఒకరోజు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం ఉండేది. అదీ కాకుంటే మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ దర్శనాలు కొనసాగేవి. భక్తుల రద్దీని బట్టి వైకుంఠ ద్వార దర్శనాన్ని పొడిగించేవారు. కానీ గత ప్రభుత్వం దీనిని పూర్తిగా మార్చివేసింది. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల భక్తులకు సౌకర్యం కల్పించడం మాట దేముడెరుగు కానీ.. టీటీడీ ఆదాయాన్ని పొందడానికేనన్నది వాస్తవం. ఎంత మంది భక్తులు వస్తే అంత హుండీ నిండుతుందన్న కారణంతోనే అత్యాశతో గత ప్రభుత్వం ఈ ఆనవాయితీని తొలిసారిగా ప్రారంభించింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిని కంటిన్యూ చేసింది. దీంతో పాటు గత ప్రభుత్వం వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లను తిరుపతిలో ఇచ్చే ప్రక్రియను కూడా ప్రారంభించింది. అసలు తిరుమలలో శ్రీవెకంటేశ్వరస్వామి కొలువై ఉంటే తిరుపతిలో టిక్కెట్లను ఎందుకు విక్రయిస్తున్నారన్నది ఆ వెంకటేశ్వరస్వామికే ఎరుక. ఈ సంప్రదాయాన్ని కూడా ఈ పాలకమండలి కంటిన్యూ చేయడంతోనే ఈ ఘోర దుర్ఘటన తలెత్తింది. నిజానికి తిరుమలలో ఎన్ని గంటలైనా భక్తులు వేచి చూస్తూ క్యూ లైన్ లో శ్రీవారిని దర్శంచుకునే వారు. అక్కడ తొక్కిసలాట సమస్య ఉండదు. బ్రహ్మోత్సవాల సమయంలోనూ తిరుమలకు లక్షల సంఖ్యలో గరుడ వాహన సేవరోజు వచ్చినా ఇలాంటి దుర్ఘటన ఎన్నడూ జరగలేదు. కారణంగానే ఈ ఘటన జరిగిందని చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం అంగీకరించారు. అది ఈ పాలకవర్గం చేసిన తప్పు అని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో మరొక అనుమానం కూడా అందరిలోనూ నెలకొంది. కావాలని ఈ దుర్ఘటనకు బాధ్యులు అయిన వారు పోలీసుల్లో ఉన్నారా? అన్న అనుమానం కూడా పాలకపక్షం నుంచి వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ఇదే రకమైన అనుమానాలను వ్యక్తం చేశారు. పోలీసులు పదకొండు వందల మంది అక్కడ ఉన్నప్పటికీ దుర్ఘటన జరిగిందంటే ఏదో బలమైన కారణం ఉండి ఉంటుందన్న వారి అనుమానాన్ని జ్యుడిషియల్ విచారణలోనే తేలనుంది. మొత్తం మీద తిరుపతి ఘటనపై జగన్ బ్యాచ్ చుట్టూ అనేక అనుమానాలు కలుగుతున్నాయి. అంటే పోలీసుల్లోనే జగన్ అంటే అభిమానం ఉన్న వారు ఈ పనికి పాల్పడ్డారా? అన్నది విచారణలో తేలనుంది. బుడమేరు విజయవాడను ముంచెత్తినప్పుడు కూడా ఇదే తరహా ఆరోపణలు వినిపించాయి. కృష్ణా బ్యారేజీ వద్ద బోట్లు అడ్డుకట్ట వేసి గేట్లు విరగేటట్లు కొందరు ప్రయత్నం చేశారని అప్పట్లో అధికార పార్టీ నేతలు ఆరోపించారు. ఆ బోటును అక్కడి నుంచి తొలగించడానికి పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. అలాగే గేటును పునర్నించేందుకు అష్టకష్లాలు పడాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా తిరుపతి ఘటనపై కూడా అలాంటి అనుమానాలు కలుగుతున్నాయని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. పోలీసులు కావాలనే తొక్కిసలాటకు కారణమయ్యారని ప్రత్యక్ష సాక్షులతోపాటు బాధితులు కూడా చెబుతున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

## అడ్డంగా బుక్కైన పేర్ని నాని



**విజయవాడ, జనవరి 10,పెన్ పవర్:** మాజీ మంత్రి పేర్ని నాని చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. రేషన్ బియ్యం పక్కదారిపై పోలీసులకు కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. మచిలీపట్నంలోపౌరసరఫరాల శాఖకు సంబంధించి గోదాములు దాదాపు 7వేల బస్తాల బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఆ గోదాములు పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉన్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పేర్ని నాని భార్యతో పాటు గోదాము మేనేజర్ మానస్ తేజ కు సైతం నోటీసులు జారీ చేశారు. అటు పేర్ని నాని భార్య పోలీస్ విచారణకు సైతం హాజరయ్యారు. ఇంకోవైపు నానికి సైతం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ తరుణంలో ఈ కేసులో కీలక ఆధారాలు పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా.. బియ్యం పక్కదారి పట్టించినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకోసం మినీ వ్యానులను వాడినట్లు తెలుస్తోంది. పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఇక్కడ గోదాములు ఉన్నాయి. వైసిపి హయాంలో పౌరసరఫరాల శాఖకు ఈ గోదాములను అద్దెకు ఇచ్చారు. రేషన్ బియ్యం ఈ గోదాముల్లో నిల్వ చేస్తుంటారు. వీటికి మేనేజర్ గా మానస తేజ్ ఉన్నారు. ఆయన నెలవారి జీతం 12 వేల రూపాయలు. అయితే ఒకేసారి మానస తేజ అకౌంట్ నుంచి పేరుని నాని ఎకౌంటుకు లక్ష 75 వేల రూపాయలు బదిలీ చేయడంపై అనుమానాలు ఉన్నాయి. తన యజమాని భర్తకు అంత మొత్తంలో మేనేజర్ పంపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మానస తేజ అకౌంట్లో సుమారు 25 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు కూడా గుర్తించారు. అందులో ఆయన వ్యక్తిగత అవసరాల కోసం ఏడు లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు కూడా పోలీస్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. తక్కువ జీతానికి పనిచేస్తున్న మానస తేజకు అంత మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు విచారణ చేపడుతున్నారు. పోలీసులకు కీలక ఆధారాలు లభించడంతో.. కోర్టు అనుమతితో ఒకరోజు కస్టడీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ బ్యాంకులో నగదు లావాదేవీల విషయంపై ప్రశ్నించినట్లు సమాచారం. మేనేజర్ మానస తేజ తో పాటు డ్రైవర్ మంగారావు, మిల్లర్ ఆంజనేయులను పోలీసులు విచారించారు. అయితే మేనేజర్ పోలీస్ విచారణకు సహకరించలేదని తెలుస్తోంది. దీంతో నిందితులను మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మంత్రిగా ఉంటూ పేర్ని నాని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన చుట్టూ ఈ కేసు తిరుగుతోంది. అయితే నిందితులు పేర్ని నాని పేరు ఎక్కడ బయట పెట్టడం లేదు. రేషన్ బియ్యం తరలించడంలో మాజీమంత్రి నానికి సంబంధం లేదని.. తామే విక్రయించామని వారు పోలీసులకు చెబుతున్నారు. ఇంతటి భారీ మొత్తంలో బియ్యం తరలించడం అక్కడ పనిచేసే వారితో సాధ్యం కాదని.. కచ్చితంగా నాని హస్తం ఉందని అనుమానిస్తున్నారు. అందుకే ఆయన చుట్టూ ఉచ్చు బిగిస్తున్నారు. మొత్తానికైతే ఈ రేషన్ బియ్యం పంపిణీ వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నానిని అరెస్టు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# డిఫెన్స్ ఆడగలిగితే అతను ప్రతి మ్యాచ్‌లో సెంచరీ కొట్టగలడు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో విఫలమైన సంగతి తెలిసిందే. పంత్ నుంచి అడపాదడపా ఇన్నింగ్స్ లు మినహాయిస్తే ఒక్క మ్యాచ్ విన్నింగ్ నాక్ కూడా రాలేదు. 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో 254 పరుగులు మాత్రమే చేయగలిగాడు . ఎన్నో అంచనాల మధ్య ఆస్ట్రేలియా గడ్డపై అడుగుపెట్టిన పంత్ విఫలం కావడం టీమిండియా విజయావకాశాలపై ప్రభావం చూపించింది. ఈ సిరీస్ లో పంత్ షాట్ సెలక్షన్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా ఆఫ్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ పంత్ సామర్థ్యాన్ని కొనియాడాడు. అశ్విన్ మాట్లాడుతూ.. " రిషబ్ పంత్ కు అన్ని షాట్స్ ఆడగలిగే సామర్థ్యం ఉంది. అతనికి రివర్స్ స్వీప్, స్లాగ్ స్వీప్ లాంటి షాట్స్ ఆడగలడు. సమస్య ఏమిటంటే ఈ షాట్‌లన్నీ హై-రిస్క్ షాట్‌లు. తన డిఫెన్స్‌తో అతను 200 బంతులు ఎదుర్కొంటే ప్రతి గేమ్‌లో తప్పకుండా పరుగులు సాధిస్తాడు. తన గేమ్ ను మెరుగు పర్చుకుంటే ప్రతి మ్యాచ్ లో 100 పరుగులు కొడతాడు. సిడ్నీ టెస్టులో రెండు రెండు వేర్వేరు నాక్‌లు ఆడాడు. తొలి ఇన్నింగ్స్ లో 40 పరుగులు చేసినా ఎవరు గుర్తించలేదు. రెండో ఇన్నింగ్స్ లో వేగంగా హాఫ్ చేసిన ఇన్నింగ్స్ కి ప్రశంసలు లభించాయి". అని ఈ దిగ్గజ స్పిన్నర్ చెప్పుకొచ్చాడు.

కారు ప్రమాదంలో రోడ్డు ప్రమాదానికి గురైన పంత్.. తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్ట్ క్రికెట్ లోకి అడుగుపెట్టిన ఈ యువ వికెట్ కీపర్.. రీ ఎంట్రీలో తన తొలి టెస్ట్ మ్యాచ్ లో సెంచరీతో సత్తా చాటాడు. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్ లో 124 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ప్రస్తుతం బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడుతూ బిజీగా ఉన్నాడు. ఐపీఎల్ చరిత్రలో రిషబ్ పంత్ కు కనీ వినీ ఎరుగని ధర లభించింది. వేలానికి ముందు ఖచ్చితంగా భారీ ధర పలుకుతాడని ఆశించిన అతనిపై కోట్ల వర్షం కురిసింది. ఇటీవలే 2024 మెగా వేలంలో రూ. 27 కోట్ల రూపాయలకు రిషబ్ పంత్ ను లక్నో సూపర్ జయింట్స్ దక్కించుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యధిక ధర కావడం విశేషం.

# తలకు తగిలిన బ్యాట్.. వార్నర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం



**హైదరాబాద్ పెన్ పవర్:** బిగ్ బాష్ లీగ్ లో ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ కు పెను ప్రమాదం నుంచి బయటపడ్డాడు. సిడ్నీ థండర్ తరపున ఆడుతున్న వార్నర్.. హెూబర్ట్ హరికేన్స్ తో శుక్రవారం (జనవరి 10) జరిగిన మ్యాచ్ లో ఈ సంఘటన జరిగింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్ లో లే మెరెడిత్ వేసిన బంతిని వార్నర్ మిడాఫ్ దిశగా ఆడాడు. ఈ దశలో బ్యాట్ విరిగి వార్నర్ తల వెనుక భాగంలో తగిలింది. అదృష్టవశాత్తు వార్నర్ తలకు ఎలాంటి గాయం కాలేదు. ఈ సంఘటనను బిగ్ బాష్ లీగ్ తమ అధికారిక ఎక్స్ లో వీడియో షేర్ చేశారు. అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన వార్నర్ బిగ్ బాష్ లీగ్ లో అదరగొడుతున్నాడు. ఈ లీగ్ లో వరుసగా రెండో హాఫ్ సెంచరీతో చెలరేగుతున్నాడు. హెూబర్ట్ హరికేన్స్ పై నేడు 66 బంతుల్లో 7 ఫోర్లతో 88 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జట్టు చేసిన 164 పరుగుల్లో వార్నర్ ఒక్కడే సగానికి పైగా పరుగులు చేయడం విశేషం. ఈ మ్యాచ్ లో వార్నర్ రాణించినా హెూబర్ట్ హరికేన్స్ పై సిడ్నీ థండర్ ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన సిడ్నీ థండర్ వార్నర్ (88) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో హెూబర్ట్ హరికేన్స్ మరో 19 బంతులు మిగిలి ఉండగానే ఛేజ్ చేసింది. టిమ్ డేవిడ్ 38 బంతుల్లో 66 పరుగులు చేసి జట్టుకు ఒంటి చేత్తో విజయాన్ని అందించాడు. అతని ఇన్నింగ్స్ లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి.

# అంతర్జాతీయ క్రికెట్‌కు టీమిండియా ఫాస్ట్ బౌలర్ రిటైర్మెంట్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత పేసర్ వరుణ్ ఆరోన్ అంతర్జాతీయ క్రికెట్ ను రిటైర్మెంట్ ప్రకటించాడు. 35 ఏళ్ల ఆరోన్ శుక్రవారం (జనవరి 10) సోషల్ మీడియా వేదికగా రిటైర్మెంట్ అవుతున్నట్టు తన నిర్ణయాన్ని తెలిపాడు. "గత 20 సంవత్సరాలుగా క్రికెట్ ఆడినందుకు సంతోషంగా ఉంది. దేవుడు, నా కుటుంబం, స్నేహితులు, సహచరులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, అభిమానులు లేకుండా ఈ ప్రయాణం సాధ్యమయ్యేది కాదు. నా క్రికెట్ ప్రయాణంలో సహకరించిన వారందరికీ నా కృతజ్ఞతలు". అని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వరుణ్ ఆరోన్ తెలిపాడు.

2011 లో వరుణ్ ఆరోన్ ఐపీఎల్ లో అద్భుతంగా రాణించి ఇంగ్లాండ్ పై తొలిసారి భారత వన్డే జట్టులో చోటు సంపాదించాడు. అదే సంవత్సరం నవంబర్ లో వెస్టిండీస్ పై టెస్ట్ అరంగేట్రం చేశాడు. గంటకు 150 కిలో మీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు. టీమిండియా తరపున కేవలం 9 టెస్టులు.. 9 వన్డేలు మాత్రమే ఆడాడు. టెస్టుల్లో 18 వికెట్లు తీసిన ఆరోన్ వన్డేల్లో 11 వికెట్లు పడగొట్టాడు. అయితే ఆ తరవాత పేలవ ఫామ్ కారణంగా భారత జట్టులో స్థానం కోల్పోయాడు. 2015 లో చివరిసారిగా భారత జట్టు తరపున చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. బెంగళూరు వేదికగా జరిగిన ఈ టెస్టులో ఆరోన్ పెద్ద రాణించకపోవడంతో జట్టులో స్థానం కోల్పోయాడు. ఈ పదేళ్లలో ఐపీఎల్ తో పాటు దేశవాళీ క్రికెట్ ఆడుతూ వచ్చాడు. ఐపీఎల్ లో 52 మ్యాచ్ లాడిన ఈ పేసర్ 44 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.

# టాప్ 10 లిస్ట్.. గేమ్ చేంజర్ థియేటర్ కౌంట్ ఎంత?



నారింజ రంగులో సందీప ధర్ మచ్చలేని లుక్స్





ఎత్నిక్ వేర్‌లో నిక్కీ తంబోలి అద్భుతమైన ఫోటోషూట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన భారీ పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్' సంక్రాంతి బరిలో సందడి చేయబోతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమా టీజర్, ట్రైలర్ విడుదల తర్వాత ప్రేక్షకులలో మరింత ఉత్సాహాన్ని నింపింది. ప్రపంచవ్యాప్తంగా 6600 పైగా థియేటర్లలో ఈ చిత్రం విడుదలవుతుండటంతో టాలీవుడ్ తరపున హైయెస్ట్ థియేటర్ కౌంట్ సాధించిన చిత్రాల జాబితాలో స్థానం సంపాదించింది.

ఈ రేంజ్ రీచ్ కావడం సినిమాపై ప్రేక్షకుల అంచనాలను మరింత పెంచింది. గత ఏడాది పుష్ప 2 పది వేల థియేటర్స్ లో విడుదలై టాప్ లో కొనసాగుతోంది. ఇక 'గేమ్ చేంజర్' కూడా సంక్రాంతి రేసులో మరింత ఆకర్షణీయంగా నిలుస్తోంది. నిర్మాత దిల్ రాజు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. శంకర్ దర్శకత్వ ప్రతిభతో సినిమా విజువల్ ట్రీట్‌గా మారబోతుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

'గేమ్ చేంజర్' థియేటర్ల కౌంట్ విషయంలో కొత్త రికార్డులు నమోదు చేయనుంది. టాలీవుడ్‌లో ఇప్పటికే పుష్ప-2, ఆర్‌ఆర్‌ఆర్ వంటి సినిమాలు ఈ లెక్కల్లో సత్తా చూపాయి. వాటితో పోలిస్తే 'గేమ్ చేంజర్' థియేటర్ కౌంట్ హిందీలో కాస్త తక్కువే. ఇక చరణ్ సినిమా మరోసారి పాన్ ఇండియా సినిమాగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకునే ప్రయత్నంలో ఉంది. హైయెస్ట్ థియేటర్ కౌంట్ సాధించడం పక్కా విజయం వైపు తీసుకెళ్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

ఇప్పటివరకు టాలీవుడ్ నుండి హైయెస్ట్ థియేటర్ కౌంట్ సాధించిన సినిమాలలో ప్రభాస్ సినిమాలే ఎక్కువగా ఉన్నాయి. బాహుబలి నుంచి ప్రభాస్ సినిమాలు 6 వేలకు తక్కువ ఉండడం లేదు. ఇక పుష్ప 2తో బన్నీ %===% రికార్డులను బ్రేక్ చేసి టాప్ లో కొనసాగుతున్నాడు. దేవర 6వ స్థానంలో ఉండగా గేమ్ చేంజర్ ఆ లిస్టులో 9వ స్థానంలో నిలవడం గమనార్హం.

**టాలీవుడ్ హైయెస్ట్ థియేటర్ కౌంట్ మూవీస్**

1. పుష్ప 2 - 10,410
2. ఆర్‌ఆర్‌ఆర్ - 10,200
3. బాహుబలి 2 - 8500-9000
4. కల్కి 2898 ఎడి - 8400-8500
5. సాహెూ - 7978
6. దేవర పార్ట్ 1 - 7100-7250
7. రాధే శ్యామ్ - 7010
8. ఆదిపురుష్ - 7000
9. గేమ్ చేంజర్ - 6550
10. సలార్ పార్ట్ 1 - 620

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com